మహిళా స్టేషన్‌లో ఫిర్యాదైతే

వేరే కానిస్టేబుళ్లను ఎందుకు పంపారు?

డీఎస్పీకి ఛార్జి మెమోతో ఝలక్

డీసీఆర్బీ సీఐ జోక్యంపై లోతైన విచారణ

పోలీసు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించేలా నివేదిక ఇచ్చిన మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సుబ్బారావుకు ఛార్జి మెమో ఇచ్చారు. డీసీఆర్బీ సీఐ బిలాలుద్దీన్, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెండైన అంశంలోనే ఈ మెమో జారీ కావడం గమనార్హం. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వివాహితకు ఒంగోలుకు చెందిన ఆమె భర్తతో విభేదాలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె పుట్టింటికి వచ్చేశారు. తన భర్త ఇంటికి వచ్చి ఇబ్బంది పెడుతున్నారంటూ ఆమె ఈ నెల 11న మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ముందు జాగ్రత్త చర్యగా ఆమె ఇంటికి పోలీసులను పంపినట్టు డీఎస్పీ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. అయితే.. మహిళా స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే అక్కడి నుంచి కానిస్టేబుళ్లను పంపకుండా డీసీఆర్బీ నుంచి పంపడమేమిటి? ఈ కేసుతో వారికేం సంబంధం? ఈ విషయాన్ని నివేదికలో ఎందుకు పొందుపరచలేదని ఎస్పీ సతీష్‌కుమార్ తప్పుపట్టారు. మరోవైపు డీఎస్పీ తన నివేదిక అందజేయడంలోనూ జాప్యం చేశారు. దీంతో ఎస్పీ మరొకరితో విచారణ చేయించి ఆ నివేదికను ఐజీకి పంపించారు. దీని ఆధారంగా అదే అంశంలో డీసీఆర్బీ సీఐ బిలాలుద్దీన్‌తో పాటు ఈయన ఆదేశాల మేరకు మఫ్టీలో వెళ్లి ఆ వివాహిత భర్తను పోలీసు వాహనంలో ఎక్కించుకెళ్లి తీవ్రంగా వేధించిన ఇద్దరు కానిస్టేబుళ్లను ఐజీ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా డీఎస్పీకి ఛార్జి మెమో ఇచ్చిన విషయాన్ని అధికారులు ధ్రువీకరించారు.

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పోలీసుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కొంతమంది పోలీసు అధికారుల్లో మార్పు రాలేదు. వారిలో పాత వాసనలు పోలేదనడానికి ఆ యువకుడిపై వేధింపులే తార్కాణం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని పోలీసు ఉన్నతాధికారులు కృత నిశ్చయంతో ఉన్నారు. తాజా కేసుతో ఏమాత్రం సంబంధం లేని డీసీఆర్బీ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల అనుచిత జోక్యం చేసుకున్నారని, వీరిపై శాఖాపరమైన విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. మరోవైపు సీఐ బిలాలుద్దీన్ గతంలో పని చేసిన చోట ఇలాంటి ఆగడాలకు ఏమైనా పాల్పడ్డారా? అన్న కోణంలోనూ ఆయా జిల్లాల ఎస్పీల నుంచి నివేదికలు రప్పిస్తున్నామని, ఆయన తప్పులు చేసినట్టు తేలితే మరింత కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

– ఈనాడు, అమరావతి

మా సమస్యలు పరిష్కరించరూ..

సీఆర్డీఏకు రాజధాని రైతుల విన్నపాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: సీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి శుక్రవారం రైతులు, రైతు కూలీలు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తుళ్లూరు ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌తోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు, సమస్యాత్మక ప్లాట్లు, ల్యాండ్ పూలింగ్, గతంలో మినహాయింపు ఇచ్చిన భూములకు ప్లాట్లు కేటాయించాల్సినవి, రాజధాని భూముల సర్వే, లాటరీ తీయాల్సిన ప్లాట్లు, భూమి లేని పేదల పింఛన్లు, రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు, అసైన్డ్ రైతుల కౌలు, ప్లాట్ల అభివృద్ధి తదితర అంశాలపై 115 అర్జీలు వచ్చాయి. వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ అధికారులకు సూచించారు.

సమస్య	అర్జీలు
భూముల అభివృద్ధిపై..	1
భూముల సర్వే	11
రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు	92
ల్యాండ్ స్కేప్, పర్యావరణం	1
ప్రణాళిక విభాగం	3
సామాజిక అభివృద్ధి విభాగం	7



అర్జీదారుడితో మాట్లాడుతున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్

రూ.184 కోట్లతో ఇవేం పనులు?

ప్రస్తుతం గుంటూరు నగరవాసుల తాగునీటి అవసరాలకు నిత్యం అందిస్తున్న నీరు 132 మిలియన్ లీటర్లు...

కొన్ని కాలనీలకు పూర్తిగా.. మరికొన్నింటికి అరకొరగానే సరఫరా అవుతోంది... పైగా ఇందులో చాలావరకు వ్యర్థంగా పోతోంది...

వేసవి వస్తే వేలాదిమంది నీటికి కటకటలాడాల్సిన పరిస్థితి..

భవిష్యత్తు అవసరాలకు రోజుకు కనీసం 150 మిలియన్ లీటర్ల నుంచి 200 మిలియన్ లీటర్ల వరకు అవసరమని అంచనా.

కానీ... అమృత్–2 పథకం కింద రూ. 184 కోట్లతో మంచి నీటి సరఫరా వ్యవస్థ మెరుగుదలకు మాత్రమే నగర ఇంజినీరింగ్ విభాగం కొత్తగా ప్రతిపాదనలు రూపొందించింది. అదనంగా నీటి వనరుల అభివృద్ధి అంశాన్ని పక్కన పెట్టింది.

- భవిష్యత్తు తాగునీటి అవసరాలపై దృష్టి సారించని ఇంజినీరింగు విభాగం
- పాతవాటికే ప్రాధాన్యం
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఎదుటకు ప్రతిపాదనలు

ఈనాడు – అమరావతి

గుంటూరు నగరంలో భవిష్యత్తు తాగునీటి అవసరాలను నగర ఇంజినీరింగ్ విభాగం పక్కన పెట్టేసింది. కేవలం ఉన్న వ్యవస్థ మెరుగుదలకే మొగ్గు చూపించింది. అమృత్-2 కింద అంది వచ్చిన అవకాశాన్ని చేజేతులా దూరం చేసుకున్నట్లయిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఉన్న పథకాల నీరు సరిపోవడం లేదు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నీటి కొరత ఉంది. భవిష్యత్తులో జనాభా కూడా పెరుగుతుంది. నగరంలో అనేకమంది విశ్రాంత ఇంజినీర్లు, నీటి సరఫరా రంగ నిపుణులు ఉన్నారు. వీరందరి అభిప్రాయాలు సేకరించి ప్రతిపాదనలు రూపొందించి ఉన్నట్లయితే మంచి ప్రణాళిక రూపుదిద్దుకోవడానికి అవకాశం ఉండేదని, ఇప్పటికైనా ఆ దిశగా ఆలోచించాలని పలువురు కోరుతున్నారు. తాజా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లనున్నారు. వీటిపై ఆయన లోతుగా అధ్యయనం చేస్తే అనేక లోపాలు కనిపిస్తాయి.



తక్కెళ్లపాడు ఫిల్టరేషన్ వాటర్ ప్లాంటు

ఇంత నిర్లక్ష్యంగానా...

❖ సంగంజాగర్లమూడిలో రెండు ప్లాంట్లు ఉన్నాయి. నీటి వనరుల్లేక ఒక ప్లాంట్ ఖాళీగా ఉంటోంది. దీన్ని వినియోగంలోకి తేవడంతోపాటు మరో ప్లాంటు నిర్మిస్తే 75 మిలియన్ లీటర్లను నిల్వ చేయడానికి అవకాశం ఉండేది. కనీసం 20 ఏళ్లపాటు నీటి ఇబ్బందులుండవు. అధికారులు దీన్ని పట్టించుకోకుండా పాత పంపింగ్‌లైను మారుస్తామని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న 15 అంగుళాల బీడు పైపులైనుపై ప్రెజర్ లేదు. ఒకప్పుడు సంగంజాగర్లమూడి నుంచి నేరుగా వచ్చే పైపులపై బాగా ఒత్తిడి ఉండడంతో నీటి లీకేజీలుండేవి. చిన్నేరుకుంట వద్ద ఉన్న సంపులోకి గ్రావిటీపై నీరొచ్చే ఏర్పాటు చేశాక లైన్ మీద ఒత్తిడి తగ్గింది. దీన్ని మార్చాలని ప్రతిపాదించడం గమనార్హం.

❖ మంగళగిరి నుంచి తక్కెళ్లపాడు వరకు ఎప్పుడో సిమెంట్ పైపులైన్ వేశారు. తక్కెళ్లపాడు కాలువ పక్కనే పంపుహౌస్ ఉంది. 1600 డయా ఇనుపలైన్ ఉంది. దీనిలోకి అదనంగా నీరొచ్చేలా ఉండవల్లి పంపింగ్ స్కీం వద్ద అవసరమైన ఏర్పాట్లు చేస్తే బాగుండేది. ఖర్చు తక్కువే. వాస్తవంగా ఇది మల్టీపుల్ పంపింగ్ లైన్. దీని నుంచి జీఎంసీతోపాటు మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ నీటిని తీసుకుంటున్నాయి. ప్రస్తుతం మంగళగిరి కార్పొరేషన్ పరిధి బాగా పెరగడంతో నీటి అవసరాలూ పెరిగాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని జీఎంసీ ప్రత్యేక లైన్ నిర్మాణానికి ప్రతిపాదిస్తే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

❖ గోరంట్ల కొండ మీద రూ. 33 కోట్లతో ప్రతిపాదించిన తాగునీటి పథకం పనులు నిధుల లేమితో ఆగిపోయాయి. పూర్తి చేయాలంటే కొంత కాంపొనెంట్ పెడితే సరిపోతుంది. అధికారులు దీన్ని పట్టించుకోలేదు.

❖ నగరంలో అదనంగా సంపులు, ఫిల్టరేషన్ పాయింట్లు, పంపింగ్ హౌస్‌ల నిర్మాణాలకు ఒక్క ప్రతిపాదనా చేయలేదు.

❖ ఉండవల్లిలో ఉన్న సోర్స్ ఇంప్రూవ్‌మెంట్ కోసమే తాజా ప్రతిపాదనలున్నాయి.

❖ విలీన గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పైపులైన్ల నిర్మాణం పూర్తికి ప్రతిపాదించడం కొంతలో కొంత మేలు.

నీటి సరఫరా విభాగానికే తెలియదు

నగరంలో నీటి సరఫరాను పర్యవేక్షించే విభాగం అధికారులకే తాజా ప్రతిపాదనలు తెలియవంటే ఎంత గుంభనంగా రూపొందించారో స్పష్టమవుతోంది. అనుభవం లేని ఓ కంపెనీకి సవివర పథక నివేదిక బాధ్యత అప్పగించి వారికి కన్సల్టెన్సీ ఛార్జీలు దోచిపెట్టారన్న ఆరోపణ వినిపిస్తోంది.

మాకు తెలియదు.. గుర్తు లేదు!

- పొంతన లేని సమాధానాలతో విసిగెత్తిస్తూ..
- తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై దాడి కేసుల్లో నిందితుల తీరిది
- న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లనున్న పోలీసులు

ఈనాడు – అమరావతి

మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయం.. తెదేపా అధినేత చంద్రబాబు ఇంటిపై దాడుల కేసుల్లో నిందితులైన వైకాపా నాయకులు విచారణకు సహకరించకపోగా.. పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో దర్యాప్తునకు అవరోధం ఏర్పడుతోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. కోర్టులంటే గౌరవం ఉంది.. విచారణకు సహకరిస్తామని చెప్పి అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ పొందిన వీరి విచారణ ఇప్పటికే ముగిసింది.

కేసుల్లో కీలకంగా ఉన్న నాయకులు మాత్రం డొంక తిరుగుడు సమాధానాలిచ్చారని పోలీసువర్గాలు తెలిపాయి. గుర్తు లేదు.. మాకు తెలియదు... మరచిపోయామంటూ చెప్పడం గమనార్హం. విచారణకు ఇచ్చిన సమయంలో కాకుండా వారికి ఇష్టమొచ్చిన సమయాల్లో హాజరయ్యారు. ఈ విషయాలన్నింటినీ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లి వారి ముందస్తు బెయిల్ పిటిషన్లను రద్దు కోరుతూ కౌంటర్ దాఖలు చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ మంత్రి జోగి రమేష్, దేవినేని అవినాష్ సహా వీరి అనుచరులు 15 మంది ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. గుంటూరు జిల్లా కోర్టు మరో 64 మందిని వచ్చే నెల 7 వరకు అరెస్టు చేయరాదని ఆదేశించింది.

ఫోన్లు మారుస్తారట!

దర్యాప్తులో కీలకమైన ఫోన్లను అప్పగించాలని పోలీసులు కోరినా ఎవరూ అప్పగించలేదు. దాడుల సమయంలో వినియోగించినవి ఇప్పుడు లేవని, వాటిని ఆఫర్ ఎక్స్ఛేంజిల్లో మార్చేసుకున్నామని ఎమ్మెల్సీ తలశిల రఘురాం, దేవినేని అవినాష్ చెప్పగా.. మాజీ ఎంపీ నందిగం సురేష్ మాత్రం తన ఫోన్ దొంగలెత్తుకుపోయారని బదులిచ్చారు. జోగి రమేష్ సైతం తాను కొత్త ఫోను వాడుతున్నానని, అయినా విచారణకు ఎందుకివ్వాలంటూ ఎదురు ప్రశ్నించారు. ఈయన అనుచరుల్లో కొందరేమో తమ ఫోన్లు వరదల్లో కొట్టుకుపోయాయని... పాడైపోయాయని చెప్పారు. ఎమ్మెల్సీ తలశిల రఘురాం బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వడానికి విముఖత చూపించారు.

మాజీ ఎంపీ, ప్రస్తుత తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు జులై 11న అప్పటి గుంటూరు సీఐడీ అదనపు ఎస్పీ విజయపాల్ సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కోర్టుకేమో విచారణకు సహకరిస్తానని చెప్పిన విజయపాల్ ఇప్పుడేమో పోలీసులకు చిక్కకుండా దాక్కోవడం చర్చనీయాంశమవుతోంది.

ప్రైవేటు ల్యాబ్‌ల్లో రక్త పరీక్షలు చేయిస్తే చర్యలు

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్. చిత్రంలో ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నసీర్ అహ్మద్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు ప్రభుత్వాసుపత్రి నుంచి రక్త పరీక్షల కోసం రోగులను ప్రైవేట్ ల్యాబ్‌లకు రిఫర్ చేస్తున్నట్టు తెలిసిందని, ఇలా చేస్తే రోగికి అయిన ఖర్చును సంబంధిత విభాగం హెచ్‌వోడీ జీతం నుంచి కోత విధిస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హెచ్చరించారు. సంబంధిత వ్యక్తులపైనా ఆసుపత్రి కమిటీ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. శుక్రవారం గుంటూరు కలెక్టరేట్‌లో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో అర్హులైన ప్రజలందరినీ ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదు చేయాలన్నారు.

ప్రధానంగా చర్చించిన అంశాలు...

★ ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ సమస్య పరిష్కారానికి ఆవరణ వెలుపల గోడ పక్కనే పార్కింగ్ చేసేందుకు అవకాశాలను పరిశీలించాలి.

★ ఆహారాన్ని పెద్ద ట్రాలీలో తెస్తుండడంతో రోగి వద్దకు వెళ్లడానికి వీలు పడడం లేదు. చిన్న ట్రాలీలైతే 15 అవసరమవుతాయి.

★ బొంగరాలబీడులో జీజీహెచ్‌కు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మించాలి.

★ ఫిర్యాదు బాక్సులను ఆసుపత్రి కమిటీ 15 రోజులకు ఒకసారి తెరిచి పరిశీలించాలి.

రూ. 10 కోట్లతో రెండంతస్తులు

ప్రభుత్వాసుపత్రి పైభాగంలో మరో రెండు అంతస్తుల నిర్మాణానికి రూ. 10 కోట్లతో పనులు చేపడతారు. జనరల్ మెడిసిన్ ఐసీయూ జీ+5 భవనాన్ని 120 పడకల సామర్థ్యంతో నిర్మించేందుకు ఓ దాత ముందుకొచ్చారని పెమ్మసాని తెలిపారు.

★ రూ. 5 కోట్లతో సర్వీసు బ్లాక్ నిర్మాణానికి తులసీ సీడ్స్ అధినేత తులసీ రామచంద్రప్రభు ముందుకొచ్చారు. సమావేశంలో కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

24 రోజులు.. రూ.56.84 కోట్ల పరిహారం

వరద బాధితులందరి ఖాతాల్లో జమ

రైతులకు అక్కరకొచ్చిన పెట్టుబడి రాయితీ

ఈనాడు – అమరావతి

మాటలు చెప్పడం కాదు.. చేతల్లో చేసి చూపించింది కూటమి ప్రభుత్వం. ప్రకృతి వైపరీత్యానికి కోలుకోలేనివిధంగా దెబ్బతిని.. ఊసురోమంటూ నిట్టూరుస్తున్న బాధితులకు సాంత్వన కలిగించింది. వరద వచ్చిన 24 రోజుల్లోనే సుమారుగా 37 వేల మంది బాధితుల ఖాతాల్లో రూ. 56.84 కోట్లను జమ చేసింది. ఈ-కేవైసీ కానివారికి మినహా మిగిలినవారి బ్యాంకు ఖాతాల్లో బుధవారం నుంచి సొమ్ము జమవుతోంది. బ్యాంకు ఖాతాకు సొమ్ము జమకాని వారు వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకుంటే పరిహారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. వరద వచ్చిన 24 రోజుల వ్యవధిలోనే పరిహారం, పెట్టుబడి రాయితీ జమ చేయడం ఇదే తొలిసారని లబ్ధిదారులు గుర్తు చేస్తున్నారు. సకాలంలో పరిహారం అందించడం వల్ల అక్కరకు వచ్చిందని అభిప్రాయపడుతున్నారు. రైతులకు వచ్చిన సొమ్ముతో మళ్లీ విత్తనాలు కొనుగోలు, పొలాలు బాగు చేసుకోవడం వంటి పనులు చేపడుతున్నారు.



ఇళ్లు నీట మునిగినవారికి

జిల్లాలో నీట మునిగిన ఇళ్లు 8,740. క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించిన అధికారులు బాధితుల జాబితా తయారు చేశారు. ఒక్కో ఇంటికి రూ. 10 వేల చొప్పున 8740 మందికి రూ. 8.74 కోట్ల సొమ్ము జమ చేశారు.



ద్విచక్రవాహనాలకు..

వరదలకు లోతట్టు ప్రాంతాల్లో నీట మునిగి, కొట్టుకుపోయిన ద్విచక్రవాహనాలు 558. వీటిన్నిటిని లెక్కించి పరిహారం కోసం ప్రతిపాదనలు పంపారు. రూ. 16.74 లక్షల సొమ్ము వాహన యజమానుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.



వ్యవసాయ పంటలకు

మినుము, పత్తి, జొన్న, పెసర, వేరుశనగ, జూట్, మొక్కజొన్న, వరి, చెరకు, కంది, నువ్వులు, సోయాబీన్ పంటలు 17,337 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. 24,589 మంది నష్టపోయారు. పెంచిన పెట్టుబడి రాయితీ రూ. 42.98 కోట్లు జమ చేశారు.



ఉద్యానపంటలకు

1,126 హెక్టార్లలో అరటి, పసుపు, కూరగాయలు, కంద, బొప్పాయి, పువ్వులు, తమలపాకు, జామ, నిమ్మ, మామిడి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. 2,591 మంది రైతులకు రూ. 3.78 కోట్ల సొమ్మును వారి ఖాతాలకు జమ చేశారు.



మూగ జీవాలకు

వరదలకు 187 పశువులు, 12 గొర్రెలు, 2 ఎద్దులు, 87 దూడలు, 527 కోళ్లు కలిపి మొత్తం 815 మూగజీవాలు కొట్టుకుపోయాయి. బాధిత కుటుంబాలకు రూ. 1.17 కోట్ల పరిహారం అందింది.

వరదల్లో ధ్రువపత్రాలు కోల్పోయారా.. దరఖాస్తు చేసుకోండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వరదలు, భారీ వర్షాలకు తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, గుంటూరు తూర్పు, పశ్చిమ మండలాలు వరద ముంపునకు గురయ్యాయని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. విలువైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్టర్ డాక్యుమెంట్స్, ఆధార్, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా పత్రాలు పాడయ్యాయని గుర్తించామన్నారు. వారి పరిధిలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు ఏడు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ధ్రువపత్రాలు కోల్పోతే నకళ్ల కోసం ఎటువంటి రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సై

ఈనాడు – అమరావతి

నవంబరునాటికి పూర్తయ్యేలా ఏర్పాట్లు

నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజీ ప్రాజెక్టుల కింద రైతుల భాగస్వామ్యంతో ప్రతీ ఎకరాకు సాగునీరందించే దిశగా తెదేపా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే రైతు ప్రతినిధులను ఎన్నుకోవడానికి వీలుగా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఉత్తర్వులిచ్చింది. ఓటర్ల జాబితా, ఎన్నికలు, ఎంపిక ప్రక్రియ మొత్తం నవంబరు తొలి వారానికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓటర్లుగా ఉన్న ఆయా కాలువల ఆయకట్టు రైతులు సమర్థులను కమిటీ ఛైర్మన్లుగా ఎన్నుకునే వెసులుబాటు ఉంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా వాటిని నిర్వీర్యం చేసింది. కాలువల నిర్వహణ, కనీస మరమ్మతులకు నిధులివ్వలేదు. ఈ కారణంగానే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు కాలువల గట్లు భారీగా తెగిపోయి వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.



సాగర్ కాలువ కింద...

నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలోని లింగంగుంట్ల సర్కిల్ కింద ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతాలున్నాయి. ఇందులో 259 నీటి వినియోగదారుల సంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ, ఒక ప్రాజెక్టు కమిటీ ఉంటాయి.

కృష్ణా పశ్చిమ డెల్టాలో...

కృష్ణా పశ్చిమ డెల్టాలోని ఉమ్మడి గుంటూరు ఆయకట్టు గుంటూరు సర్కిల్ పర్యవేక్షణలో ఉంటుంది. బాపట్ల జిల్లాలో 16 డిస్ట్రిబ్యూటరీ కమిటీల (డీసీ) కింద 94 డబ్ల్యూయూఏలు, గుంటూరు జిల్లాలో 9 డీసీల కింద 50 డబ్ల్యూయూఏలు, ప్రకాశం జిల్లాలో ఒక డీసీ కింద 2 డబ్ల్యూయూఏలున్నాయి. గుంటూరువాహిని కింద రెండు డీసీల పరిధిలో 14 డబ్ల్యూయూఏలున్నాయి. మొత్తం 22 డీసీలు, 160 డబ్ల్యూయూలు ఉన్నాయి. ఇందులో 6 డీసీలు రెండు జిల్లాల్లో కలిసి ఉన్నాయి.

కమిటీల స్వరూపం ఇలా...

కాలువల కింద 6 నుంచి 12 మందితో ప్రాదేశి నియోజకవర్గాలుగా (టీసీ)గా గుర్తిస్తారు. ఇందులో ప్రతి ఆయకట్టుదారుడు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారుల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలి. వీరంతా నీటి వినియోగదారుల సంఘాన్ని (డబ్ల్యూయూఏ) ఎన్నుకుంటారు. వీటి ఛైర్మన్లుగా ఎన్నికైన వారు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్లను, వీరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు.

★ సాగర్ కాలువల కింద లింగంగుంట్ల, ఒంగోలు సర్కిళ్లున్నాయి. వీటికి ఒకే ప్రాజెక్టు కమిటీ ఉంటుంది.

★ కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో గుంటూరు సర్కిల్ కింద అన్ని సంఘాలుంటాయి. ఇక్కడి డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఇందులో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల రైతులు ఓటర్లుగా ఉంటారు.

చిన్ననీటిపారుదలశాఖ పరిధిలో...

ఉమ్మడి జిల్లాలో చిన్ననీటిపారుదల కింద 60 డబ్ల్యూయూఏలున్నాయి. ఇందులో పల్నాడు పరిధిలో 55, గుంటూరు జిల్లాలో 5 ఉన్నాయి. ఇవన్నీ చెరువుల కింద 21,234 ఎకరాల ఆయకట్టు ఆధారంగా ఏర్పాటవుతాయి. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్నందున ఇక్కడ డీసీ, పీసీ ఉండవు.

ఆయకట్టుదారులకు మెరుగైన సేవలు

నీటి వినియోగదారుల సంఘాలుంటే సంబంధిత ఛైర్మన్లు ఆయా కాలువల కింద సాగునీరు సక్రమంగా వెళ్లేలా చూస్తారు. అత్యవసర పనులపై అధికారులకు సమాచారం ఇచ్చి యుద్ధప్రాతిపదికన అయ్యేలా చూస్తారు. చివరి భూములకు నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. వరదలు, భారీ వర్షాల సమయంలో కాలువలు, డ్రెయిన్ల గట్ల పరిస్థితి అధికారులకు తెలియజేసి అవసరమైన చర్యలు చేపడతారు. కాలువల మరమ్మతు, నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చిన నిధులను సక్రమంగా వినియోగిస్తారు. నీటితీరువా వసూలయ్యేలా చూస్తారు.

ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరేనా ?

- నిరుపయోగంగా ఫైబర్ నెట్ పరికరాలు
- గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితం

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఫైబర్ నెట్ పరికరాలు పంచాయతీల్లో వెక్కిరిస్తున్నాయి. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ఒక్కో పంచాయతీకి ఇచ్చిన పరికరం ఆకారానికి మాత్రమే మిగిలింది. ఫలితంగా ఒక్క మంగళగిరి నియోజకవర్గంలోనే రూ.లక్షలు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో రెండేళ్ల క్రితం అన్ని పంచాయతీలకు బీఎస్ఎన్ఎల్ ప్రాజెక్టు కింద ఫైబర్ నెట్ ఇచ్చేందుకు పరికరాలు ఇచ్చారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే అంతర్జాలం మరింత వేగవంతంగా ఉంటుంది.


దుగ్గిరాల పంచాయతీ కార్యాలయంలో అమర్చిన పరికరం

రూ.కోట్లలో ఖర్చు...

అంతర్జాల కనెక్షన్ ఇచ్చేందుకు ర్యాక్, స్విచ్‌తో కూడిన పరికరాలు ఇచ్చారు. ఒక్కొక్క ర్యాక్ రూ. 7 వేలు నుంచి 10 వేలు, స్విచ్ విలువ రూ. 40 వేలు నుంచి రూ. 50 వేలు ఉంటుందని దీనిపై అవగాహన ఉన్న వాళ్లు చెబుతున్నారు. ఈ విధంగా గణిస్తే మొత్తం పరికరానికి రూ. 50 వేలు నుంచి రూ. 60 వేల వెచ్చించారు. ఒక్క మంగళగిరి నియోజకవర్గంలోనే 40 పంచాయతీలు ఉండగా వీటిని ఇచ్చారు. దీని ప్రకారం నియోజకవర్గంలో రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షలు వరకు ఖర్చుపెట్టారు. ఇక కనెక్షన్ ఇచ్చేందుకు గ్రామాల మధ్య ఫైబర్ ఏర్పాటు చేశారు. సాధారణ వైరు అయితే మీటరు రూ. 10 నుంచి 15 ఉంది. కానీ అధునాతన ఈ వైరు మీటరు రూ. 60 నుంచి రూ. 70 వరకు ఉంటుందని అంచనా. మంగళగిరి-దుగ్గిరాల మధ్య 16 కి.మీ ఉంది. కిలో మీటరుకు రూ. 80 వేలుగా లెక్కిస్తేనే.. వైరుకు రూ.12.8 లక్షలు అవుతుంది. ఇలా పంచాయతీలన్నింటికి కలిపి రూ.కోట్లలోనే ఖర్చు పెట్టారు.

ప్రాజెక్టు ఏమైనట్లో..!

బీఎస్ఎన్ఎల్ ప్రాజెక్ట్ ద్వారా చేపట్టిన ఈ పనులు ఇప్పుడు ఏమయ్యాయనేది తెలియడం లేదు. గత ప్రభుత్వం అసలు ఎంత ఖర్చు పెట్టిందనేది? ఏ మేరకు వెచ్చించారు? విలువలో ఏమైనా మతలబులున్నాయా? లేక వేరే ఏమీ లేకుండా ఎందుకు నిర్లక్ష్యం చేశారు వంటి ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. దీనిపై సమగ్ర విచారణ చేస్తే వాస్తవాలు వెల్లడవుతాయి.

రూ.11 లక్షలు తీసుకుంటే రూ.43 లక్షలు కట్టమంటున్నారు

'ప్రజా దర్బార్'లో మంత్రి నారా లోకేశ్‌కు వినతుల వెల్లువ

తాడేపల్లి, న్యూస్‌టుడే: రూ.11 లక్షలు రుణం తీసుకుంటే రూ.43 లక్షలు కట్టమని ఒత్తిడి చేస్తున్నారంటూ కాకినాడ జిల్లా భీమవరపుకోటకు చెందిన ఆళ్ల దేవి 'ప్రజా దర్బార్'లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తాడేపల్లి మండలం ఉండవల్లి నివాసంలో మంత్రి ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. తనకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు చెప్పి జీపీఏ సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసి తమ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ మహిళ మంత్రి లోకేశ్ వద్ద కన్నీళ్ల పర్యంతమైంది. 'కుటుంబ అవసరాల కోసం మళ్ల కోటేశ్వరరావు వద్ద రూ.11 లక్షలు రుణం తీసుకున్నాం. తనఖా రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్ రైటర్‌తో కలిసి మమ్మల్ని మోసం చేశారు. తనఖా అని చెప్పి స్టాంప్ పేపర్లపై సంతకాలు చేయించుకుని మోసం చేశారు. ఆ తర్వాత కాగితాలు మార్చేసి జీపీఏ, సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేశారు. అదేమని ప్రశ్నిస్తే పోరాటాలు బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పుడు వడ్డీతోసహా రూ.43 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.' అని ఆమె మంత్రి వద్ద వాపోయారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

★ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న భర్త గుండెపోటుతో మృతిచెందారని, కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగం ఇవ్వాలని అన్నమయ్య జిల్లా కోడూరుకు చెందిన దద్దాయిని, తెదేపా కార్యకర్తలు నెపంతో వైకాపా పాలనలో తనపై అక్రమంగా కేసులు బనాయించారని గుంటూరు 50వ డివిజన్‌కు చెందిన పఠాన్ బాజీ, బేడ, బుడ్గ జంగం సామాజిక వర్గాలకు ఎస్సీ ధ్రువీకరణపత్రం మంజూరు చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా మేదరుల సంక్షేమ సంఘం వినతులు ఇచ్చారు. గత దశాబ్ద నుంచి ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

ప్రయాణికులకు సదుపాయాలు కల్పించాల్సిందే

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలు కల్పించాల్సిందేనని మండల రైల్వే అధికారి రామకృష్ణ ఆదేశించారు. 'ఈనాడు'లో ఈనెల 27వ తేదీన 'స్వచ్ఛత సరే.. సదుపాయాలేవీ..?' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందులో అత్యవసరమైన మూత్రశాలలు లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని, ఆర్‌యూబీలో బురద పేరుకుపోయి నడవాలంటే అవస్థలు పడుతున్నారని వివరించాం. దీనిపై స్పందించిన డీఆర్ఎం రామకృష్ణ శుక్రవారం స్వయంగా రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. ఆర్‌యూబీలో నీరు రాకుండా నియంత్రించాలని, మూత్రశాలలను అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కొత్త సర్కిళ్లకు ఎస్ఈలు కేటాయింపు ఎప్పుడో?

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: సెంట్రల్ డిస్కం పరిధిలో నరసరావుపేట, బాపట్లలో కొత్తగా సర్కిళ్లు ఏర్పాటు చేస్తూ ఆ సంస్థ సీఎండీ పి.రవి ఈనెల 22న తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఆదేశాలు జారీ చేసి ఐదు రోజులు గడిచినప్పటికీ పర్యవేక్షక ఇంజినీర్లను నియమించలేదు. దీంతో ఆ సర్కిళ్లు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఆ రెండు సర్కిళ్లకు ఈఈలు, డిప్యూటీ ఈఈలను కేటాయించారు. అక్కడ ఎస్ఈ ఎవరూ లేనందున వారు ఎవరికి రిపోర్టు చేయాలో అర్థం కాక పాత పోస్టుల్లోనే కొనసాగుతున్నారు.

రైతుకు సొసైటీ సేవలు మరింత చేరువ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా రైతులకు మరింత చేరువగా సేవలు అందించాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి, జేసీ ఎ.భార్గవ్ తేజ అన్నారు. జిల్లా కోర్టు రోడ్డులోని డీసీఎంఎస్ కార్యాలయంలో సొసైటీ 81వ మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. మహాజన సభకు పర్సన్ ఇన్‌ఛార్జి, జేసీ భార్గవ్ తేజ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పాదకాలైన ఎరువులు, విత్తనాలను తక్కువ ధరలకు విక్రయించడం, మద్దతు ధరకు పంటలు కొనుగోలు చేయడంలో సొసైటీని రాష్ట్రంలో ఉత్తమంగా నిలపాలన్నారు. ఎరువుల కొరత ఏర్పడినప్పుడు సొసైటీ ద్వారా రైతులకు ముందుచూపుతో మంచి సేవలు అందిస్తున్నారన్నారు. మరిన్ని వ్యాపారాల నిర్వహణకు సొసైటీలు ముందుకు రావాలని, సహకార రంగాన్ని మరింత వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం 2022-23 సంవత్సరం ఆడిట్ నివేదికను మహాజన సభ ఆమోదించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.10 కోట్ల లాభం చేకూరినట్లు తెలిపారు. అదేవిధంగా 2023-24 సంవత్సరం ఆడిట్ నివేదికను మహాజన సభలో సమర్పించి ఆమోదం పొందింది. రూ.1.08 కోట్ల లాభం సొసైటీలకు చేకూరిందన్నారు. సభలో డీసీఎంఎస్ బీఎం హరిగోపాల్, సొసైటీల పర్సన్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి భార్గవ్ తేజ

జడ్పీ డిప్యూటీ సీఈవోగా కృష్ణ బాధ్యతల స్వీకరణ

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు డిప్యూటీ సీఈవోగా వి.సి.హెచ్. కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా డిప్యూటీ సీఈవో జె.మోహన్‌రావుని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో కృష్ణని నియమించింది. మోహన్‌రావు విధుల నుంచి రిలీవ్ కావడంతో కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. సీఈవో వి.జ్యోతిబసుని కలిసి రిపోర్టు చేశారు.



ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పౌరసరఫరాల సంస్థ ముఠా కార్మికుల కూలీ రేట్ల ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగురి రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గుంటూరు బస్‌స్టాండ్ సమీపంలోని సంస్థ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద శుక్రవారం రెండు గంటల పాటు మెరుపు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ముఠా కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. రెండు గంటల పాటు కార్మికులు పనులు నిలుపుదల చేస్తేనే సరకు తరలించే లారీలన్నీ నిలిచిపోయాయని, నిరవధిక సమ్మె చేస్తే ఇక పౌరసరఫరాల వ్యవస్థ పరిధిలో అన్ని సేవలు నిలిచిపోతాయన్నారు. ప్రతి రెండేళ్లకు కూలీరేట్లు పెంచాల్సి ఉందని, గత ప్రభుత్వ హయాంలో పెంపుదల ప్రక్రియ కొలిక్కి వచ్చే సమయంలో ఎన్నికలు రావడంతో నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇంత వరకు కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టలేదన్నారు. ఇప్పటికైనా వారి సమస్యలు పరిష్కరించాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర నాయకుడు సురేష్‌బాబు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలను దృష్టిలో ఉంచుకుని కూలీ రేట్లు పెంచాలని కోరారు. కూలీ రేట్ల ఒప్పందం అమలుకు పోరాటాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రతి నెలా పదో తేదీలోగా బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, జిల్లా అధ్యక్షుడు కోట్ల మరియదాసు, నాయకులు దానం కాంతారావు, వినుకొండ డేవిడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


హమాలీలు, ఏఐటీయూసీ నాయకుల ధర్నా

బదిలీల్లో తకరారు!

ప్రజాప్రతినిధుల తీరు చర్చనీయాంశం

ఈనాడు - అమరావతి

ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో కొత్త సంగతులు బయట పడుతున్నాయి. ప్రభుత్వం చాలా స్పష్టంగా మార్గదర్శకాలను విడుదల చేసినా.. క్షేత్రస్థాయిలో కొన్ని పరిణామాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

గుంటూరు నగర పాలక సంస్థలోని ప్రణాళిక విభాగంలో అవినీతి తారస్థాయికి చేరింది. అధికారులు లేని నిబంధనలను తెచ్చి బలవంతంగా దండుకున్న ఉదంతాలెన్నో. వీటిపై కొంతమంది బాధితులు మీడియాకెక్కిన సందర్భాలూ ఉన్నాయి. ముడుపుల ధాటికి తట్టుకోలేక నగర ప్రణాళిక విభాగ అధికారులందరినీ బదిలీ చేయాలంటూ బిల్డర్ల సంఘం పలుమార్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రికి, ప్రణాళిక విభాగం సంచాలకుడిని ఫిర్యాదు చేసింది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఒకరిని తప్ప మిగిలిన డీసీపీలు, ఏసీపీలు, టీపీఎస్‌లను బదిలీ చేశారు. వీరెవరూ ఇంకా రిలీవ్ కాలేదు. ఇదే అదనుగా తమ బదిలీలను నిలుపుకోవడానికి వీరంతా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓ ప్రణాళికాధికారి ఇక్కడే కొనసాగాలంటూ ఓ ప్రజాప్రతినిధి నుంచి లేఖ తీసుకోవడం చర్చనీయాంశమైంది. దీంతో బిల్డర్ల సంఘ నాయకులు ఆ ప్రజాప్రతినిధిని కలిసి సదరు అధికారి అవినీతి వ్యవహారాలను పూసగుచ్చినట్టు వివరించాల్సి వచ్చింది. దీంతో తన లేఖను వెనక్కి తీసుకుంటానని చెప్పారని సంఘ నాయకుడొకరు 'ఈనాడు'కు తెలిపారు. గుంటూరులో నాలా పన్ను ఉండదని, అలాంటిది ఆ అధికారి అది విధించి ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారని చెప్పారు.

★ ఇంజినీరింగ్ విభాగంలో బదిలీకి అర్హులు కాని కొంతమంది ఏఈ, డీఈలను సాగనంపాల్సిందేనంటూ కొందరు ప్రజాప్రతినిధులు ఉన్నతస్థాయిలో పట్టుబడుతున్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడితేనో.. బదిలీకి అర్హత ఉంటేనో కదుపుతారు తప్ప.. ప్రజాప్రతినిధులిచ్చిన లేఖ ఆధారంగా బదిలీ చేస్తే ట్రైబ్యునల్, కోర్టును ఆశ్రయిస్తామంటూ మరి కొందరు చెబుతున్నారు. మొత్తంగా బదిలీ వ్యవహారాలు రసవత్తరంగా మారాయి.



బకాయిలు విడుదల చేస్తేనే పరిశ్రమ మనుగడ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం రూ.1,400 కోట్లు బకాయిలు విడుదల చేసి టెక్స్‌టైల్ పరిశ్రమను ఆదుకోవాలని ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ ఛైర్మన్ కోటిరావు కోరారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని క్యాపిటల్ హోటల్‌లో ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం జరిగింది. కోటిరావు మాట్లాడుతూ పరిశ్రమకు బకాయిలు చెల్లించకపోవడంతో మనగడ సాగించడం కష్టంగా ఉందన్నారు. గౌరవ ఛైర్మన్ లంకా రఘురామిరెడ్డి మాట్లాడుతూ టెక్స్‌టైల్ పరిశ్రమకు నూతన టెక్స్‌టైల్ పాలసీ ప్రకటించాలన్నారు. వైస్‌ఛైర్మన్ సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమ పట్ల మంత్రి లోకేశ్‌కు పూర్తి అవగాహన ఉందన్నారు. త్వరలోనే పరిశ్రమను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి చలపతిరావు, వైస్‌ఛైర్మన్లు సత్యనారాయణ, సూర్య ప్రకాశరావు, బెనర్జీ, కార్యదర్శి మల్లేశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు. విపత్తుల శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ అగ్నిప్రమాదాల నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న కోటిరావు, పక్కన సంఘ నాయకులు

గుంటూరు ఆర్డీవోగా శ్రీనివాసరావు బాధ్యతలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారిగా కె. శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఆర్డీవోల బదిలీలు గురువారం నిర్వహించగా విజయవాడలో పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు రెవెన్యూ డివిజన్‌కు బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పి.శ్రీకర్‌ను కోనసీమ జిల్లా కొత్తపేట రెవెన్యూ డివిజన్‌కు బదిలీ చేశారు.



జేవీవోగా శ్రీనివాసరావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల దేవాదాయశాఖకు చెందిన ఆలయాల ఆభరణాలు తనిఖీ అధికారి (జేవీవో)గా డి.శ్రీనివాసరావు శుక్రవారం గుంటూరు కొత్తపేటలోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో గుంటూరు జిల్లా దేవాదాయశాఖ కార్యాలయం సూపరిండెంట్‌గా విధులు నిర్వహించారు. 2008లో సహాయ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన నెల్లూరు జిల్లా పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా, ఒంగోలు జిల్లా సహాయ కమిషనర్‌గా, తెనాలి వైకుంఠపురం దేవస్థానం లాంటి తదితర ఆలయాల్లో ఈవోగా పనిచేశారు. చివరిగా లాలాపేట వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఇటీవల జరిగిన బదిలీలో గుంటూరు జోన్ జేవీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఈవోలు, సిబ్బంది జేవీవోకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


సహాయ కమిషనర్ శ్రీనివాసరావు

బ్రాయిలర్ ధరలు (కిలో /కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

జాషువా పురస్కారానికి పీవీ రమణ ఎంపిక

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: జాషువా కల్చరల్ సెంటర్ కన్వీనర్, ప్రజా గాయకుడు పీవీ రమణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కవి కోకిల జాషువా పురస్కారం-2024కు ఎంపికయ్యారు. విజయవాడలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంటలకు పురస్కారం అందుకోనున్నారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ పదేళ్లుగా తాను చేస్తున్న జాషువా సాహిత్య కార్యక్రమాలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం పురస్కారానికి ఎంపిక చేసిందన్నారు. తనను ప్రోత్సహిస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. పీవీ రమణ రాష్ట్ర ప్రభుత్వ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, సంస్కృతి వ్యవస్థాపకుడు సత్రాజు బాలచందర్, జాషువా కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ పి. ముత్యం, ఎస్.బాలస్వామి, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్, బీమ్‌సేన సేవా నాయకులు నల్లపు నీలాంబరం, ఎస్సీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అమరావతి సర్కిల్ నాయకులు మేడికొండ సునీల్, రంగం రాజేష్, ప్రజా గాయని లెనినా, బిళ్ల నాగరాజు తదితరులు అభినందనలు తెలిపారు.



ఆరు మండలాల్లో స్వల్ప వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆరు మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు 1 మిల్లీ మీటర్లు నమోదు కాగా.. తాడేపల్లి 6.8, మంగళగిరి 5, కొల్లిపర 3.2, గుంటూరు తూర్పు 1.6, గుంటూరు పశ్చిమ 1.6, పొన్నూరు 0.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

తెదేపా, జనసేన కార్యకర్తల శ్రమదానం



ఎర్రబాలెం(మంగళగిరి), న్యూస్‌టుడే: మంగళగిరి, తాడేపల్లి నగర పరిధిలోని ఎర్రబాలెంలో తెదేపా, జనసేన కార్యకర్తలు శుక్రవారం నగరపాలక సిబ్బందితో కలసి శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. రహదార్లను ఊడ్చి శుభ్ర పరిచారు. కాలువల్లోని మురుగును తొలగించారు. తొలుత గ్రామంలో స్వచ్ఛతా హి సేవ 2024 ర్యాలీ నిర్వహించారు. నగరపాలక కమిషనర్ అలీంబాషా, నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, కాపురౌతు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రత కాపాడాలంటూ పాదయాత్ర



ప్రభూ దూలం

మంగళగిరి, న్యూస్‌టుడే: తితిదే పవిత్రతను కాపాడాలంటూ విజయవాడకు చెందిన ప్రభూ దూలం అనే యువకుడు తిరుమలకు పాదయాత్ర ప్రారంభించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఉదయం బయలుదేరి మధ్యాహ్నానికి మంగళగిరి చేరుకున్నారు. ఆలయ పవిత్రతకు భంగం కలిగించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయంలో అన్యమత ఉద్యోగులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? మంగళగిరి గోలివారి వీధిలో పైపులైను కోసం రోడ్డు పగలగొట్టారు. రోడ్డు తవ్వి వదిలివేయడం వల్ల ఇబ్బందిగా ఉంది. **- వీరాస్వామి, మంగళగిరి.**

✔ మరమ్మతులకు ప్రతిపాదన రూపొందించి అసౌకర్యం లేకుండా రోడ్డుపై గుంతను పూడ్చుతాం.
- అలీంబాషా, నగర పాలక కమిషనర్
- మంగళగిరి, న్యూస్‌టుడే

? తాడికొండ జయభారత్ కాలనీకి సమీపంలో చెత్త పేరుకుపోయి కుక్కలు, పందులు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో కుక్కలు వెంటపడి కరుస్తున్నాయి.

✔ ఎప్పటికప్పుడు చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
- శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి
–తాడికొండ, న్యూస్‌టుడే

పర్యాటక దినోత్సవం

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఉండవల్లి అనంతపద్మనాభస్వామి గుహాలయాల వద్ద శుక్రవారం తెదేపా ఆధ్వర్యాన పర్యటక దినోత్సవం నిర్వహించారు. జిల్లా పర్యటక శాఖాధికారి శ్రీరమ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె దేశ సంస్కృతి, చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఎంఈవో శాంతకుమారి, నాగేశ్వరరావు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్, లింగంశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న జ్వరాలు

రోగులతో ఆసుపత్రులు కిటకిట
కలుషిత నీటితో రోగాల ముప్పు



ప్రత్తిపాడు: సీహెచ్‌సీలో జ్వర బాధితులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని గ్రామాలను జ్వరాలు వణికిస్తున్నాయి. సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం వచ్చే ప్రతి పది కేసుల్లో 6, 7 జ్వరాలే నమోదు కావడం భయాందోళన కలిగిస్తోంది.

నియోజకవర్గంలో ఇలా..
- జనాభా సుమారు 3.45 లక్షలు
- మండలాలు 5
- పంచాయతీలు 73
- కుటుంబాలు సుమారు 80 వేలు
- డెంగీ లక్షణాలతో చేరిన రోగులు 2
- ఈ నెలలో ప్రత్తిపాడు వైద్యశాలలో నమోదైన జ్వరాల కేసులు 651

గత పాలకుల నిర్లక్ష్యమే శాపం..

ఆగస్ట్, నెలాఖరు నుంచి వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. వర్షానికి వాగులు, వంకలు పొంగి చెత్త, వ్యర్థాలతో కూడిన నీరు మంచి నీటి చెరువులకు చేరింది. ఒకటి రెండు, గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లోనూ వడపోత బావులు మరమ్మతులకు గురయ్యాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాల నిర్వహణకు గాలికి వదిలేశారు. పంచాయతీల నిధులను పక్కదారి పట్టించడంతో కనీసం ఫిల్టర్ బెడ్డులకు మరమ్మతులు చేసేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో చాలా చోట్ల శుద్ధం జలం కాకుండా నేరుగా చెరువుల నుంచే కొళాయిలకు నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ నీటినే నూరుశాతం క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు.



హోటళ్లకు సరఫరా చేస్తున్న మంచినీటి డబ్బాలు నాచుపట్టి ఇలా..

ప్రైవేటు దందా..

శుద్ధ జలం అందకపోవడంతో ప్రజలు ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వాటి నిర్వాహకులు నిబంధనలకు నీళ్లొదిలేశారు. కనీసం నీటి డబ్బాలను శుభ్రం చేయడం లేదు. అపరిశుభ్రంగా ఉన్న వాటితోనే నీటిని విక్రయిస్తున్నారు. ఆదాయమే లక్ష్యంగా చేసుకుని ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. తనిఖీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలి

సెప్టెంబరు నెలలో జ్వరాల కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ప్రతి రోజు చికిత్సకు వచ్చే రోగులు 10 మందిలో ఏడుగురు జ్వర బాధితులే. కలుషిత నీరు, దోమకాటుతో జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. జ్వర లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉండాలి.
- డాక్టరు ప్రవీణ్, సీహెచ్‌సీ, ప్రత్తిపాడు

దివ్యాంగునికి వీల్‌ఛైర్ బహూకరణ

మానవత్వం చాటిన మంత్రి లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం 'ప్రజా దర్బార్'లో శుక్రవారం ప్రజలను నేరుగా కలుసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి భరోసా ఇచ్చారు. తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన గాదం ఆనందతేజ తల్లిదండ్రులు సహకారంతో మంత్రిని కలసి వీల్‌ఛైర్ ఇప్పించాలని కోరాడు. స్పందించిన లోకేశ్ అప్పటికప్పుడే వీల్‌ఛైర్ అందించి మానవత్వాన్ని చాటారు. తొలుత బుజాలపై మోసుకొచ్చిన బాలుడిని తిరిగి వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు మూడు చక్రాల కుర్చీలో ఆనందంగా తీసుకెళ్లారు.



సమస్య తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

పలు సమస్యలు ఇలా..

వైకాపా పాలనలో నకిలీ పాస్‌పుస్తకాలతో గుంటూరు జిల్లా సిరిపురంలోని తన భూమిని అన్యాక్రాంతం చేశారని మంగళగిరి బాపనయ్యనగర్‌కు చెందిన షేక్ షబ్బీర్ మంత్రి నారా లోకేశ్‌కు వివరించారు. గిఫ్ట్ డీడ్ కింద సంక్రమించిన తమ భూమిని షేక్ అబ్దుల్ కరీం రీసర్వే చేయించి తప్పుడు పాస్‌పుస్తకాలు సృష్టించి కబ్జా చేశారని వివరించారు. ★ సొంత ట్రాక్టర్ ఉన్న తన భర్తకు స్థానికంగా ఉచిత ఇసుక సరఫరా చేసేందుకు అవకాశం కల్పించాలని, గత వైకాపా ప్రభుత్వంలో అక్రమ కేసులు నమోదు చేశారని మంగళగిరికి చెందిన జొన్నకూటి వెంకటరమణ, వితంతు పింఛను మంజూరు చేయాలని ఓ మహిళ వినతులు ఇచ్చారు.

చిన్నారుల సాయం



మంత్రి లోకేశ్‌కు విరాళం అందిస్తున్న చిన్నారులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం దొండపాడుకు చెందిన రైతు కొమ్మినేని విష్ణు కుమార్తెలు సాద్వి, శాన్విలు వారు దాచుకున్న పాకెట్ మనీ రూ.20 వేలు శుక్రవారం మంత్రి నారా లోకేశ్‌ను కలసి వరద బాధితుల సహాయం కోసం విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి చిన్నారులను అభినందించారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

తాడేపల్లి : యువతను గంజాయికి బానిసలు చేసి భవిష్యత్తును గత ప్రభుత్వం నాశనం చేసిందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో కూటమి వంద రోజులు పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' సభను డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు పింఛన్ పెంచి అందజేస్తున్నారని తెలిపారు. తెదేపా మండలాధ్యక్షుడు అమరా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లిశేషు, పార్లమెంటు అధికార ప్రతినిధులు పటాన్ కాశింఖాన్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు బుర్రా కృష్ణవందన, నాయకులు లాల్‌చంద్, ఈపూరి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని డోకిపర్రు గ్రామంలో శుక్రవారం స్వర్ణాంధ్ర 2047, 'ఇది మంచి ప్రభుత్వం', స్వచ్ఛతేహి సేవ కార్యక్రమాలు జరిగాయి. దీనికి సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సర్పంచి కొండెపోగు సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, ఉప సర్పంచి జానీ, తెదేపా నాయకుడు కంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వడ్డేశ్వరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనురాధ



కరపత్రాలు చూపుతున్న అధికారులు, నాయకులు

100 రోజుల్లోనే మంచి కార్యక్రమాలు

పేరకలపూడి(దుగ్గిరాల), న్యూస్‌టుడే: నూతన ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే మంచి కార్యక్రమాలు చేపట్టిందని పలువురు వక్తలు అన్నారు. పేరకలపూడి, మోరంపూడిలలో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. స్వచ్ఛతా హీ సేవ, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాల్ని నిర్వహించారు. సర్పంచులు ఇత్తడి రమేష్, గంపల గంగాధరరావు, కార్యదర్శి జయదేవ్ తదితరులున్నారు.



దుగ్గిరాల: పేరుకలపూడి గ్రామ సభలో మాట్లాడుతున్న వక్తలు

అట్రాసిటీ కేసు నమోదుపై బహిరంగ విచారణ

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గరుడాచలపాలెంలో శుక్రవారం అధికారులు, పోలీసులు బహిరంగ విచారణ చేపట్టారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొద్ది నెలల కిందట సార్వత్రిక ఎన్నికలు ఫలితాల సమయంలో గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పరస్పర ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కేసులకు మొత్తం 51 మందిని విచారించినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీకర్, తుళ్లూరు సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి డీఎస్పీ మల్లికార్జునరావు, సీఐ రవీంద్రబాబు, డిప్యూటీ తహసీల్దారు రాజా రమేష్, ఎంపీడీవో వెంకటేశ్వరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీకుమారి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

తుళ్లూరు: హత్యాయత్నం కేసులో కడప సెంట్రల్ జైల్లో వార్డెన్‌గా పనిచేస్తున్న కె.మహేష్‌కు మంగళగిరి కోర్టు శుక్రవారం 14 రోజుల రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . కాకినాడకు చెందిన ఎస్. భువనేశ్వరి రాష్ట్ర హైకోర్టులో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు మహేష్‌తో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహమైంది. వీరు రాజధాని గ్రామం రాయపూడిలో ఇళ్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు 22న మనస్పర్థల నేపథ్యంలో అత్త సాయి కుమారిపై దాడి చేసి గ్యాస్‌తో కాల్చాడు. ఈ ఘటనపై ఆమె కూమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుళ్లూరు ఎస్.ఐ జి.అంకమ్మ హత్యాయత్నం కేసు నమోదు చేశారు. శుక్రవారం ముద్దాయి మహేష్‌ను అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సి.ఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

రుణాలందక.. సాగు చేపట్టలేక..

రైతుల ఆవేదన


పెదనందిపాడు, న్యూస్‌టుడే



అలంకారప్రాయంగా పెదనందిపాడు సహకార పరపతి సంఘ కార్యాలయం


పెదనందిపాడు సహకార పరపతి సంఘంలో రైతులకు పంట రుణాలు ఇవ్వడం మిధ్యగానే ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ఇంత వరకు రుణాలు ఇవ్వకపోవడం ఏంటని, ఎలా సాగుచేపట్టాలని ప్రశ్నిస్తున్నారు. తమ భూములను మార్ట్‌గేజ్ చేయించి అవసరమైన పత్రాలు తెప్పించి రుణాలివ్వకుండా గత కొన్ని నెలల నుంచి అధికారులు తిప్పుతున్నారని కొందరు రైతులు చెబుతున్నారు. గత ఏడాది ఈ సొసైటీలో 67 మంది రైతులకు రూ. 1.50 కోట్లు రుణాలిచ్చారు. ఈ ఏడాది రూ. 1.25 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా ఇంత వరకు ఎవరికీ రుణాలిచ్చిన దాఖలాలు లేవు. సొసైటీకి నియమించిన పర్సన్ ఇన్‌ఛార్జి అందుబాటులో ఉండరని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకుని రుణాలిప్పించాలని రైతులు కోరుతున్నారు

పత్రాలు ఇచ్చినా ఫలితం లేదు



రూ. వేలు ఖర్చు చేసి సొసైటీ చెప్పిన పత్రాలను తెచ్చి ఇచ్చాను. అన్ని నిబంధనలను పాటించా. కొన్ని నెలల నుంచి రుణం ఇస్తామని చెబుతూ కాలం గడిపేస్తున్నారు కానీ ఫలితం లేదు. **-పి. జోజిబాబు, రైతు, రాజుపాలెం**

రోజూ తిరుగుతున్నా..



అధికారులు చెప్పిన ప్రకారం మార్చి 2024 లో భూమిని మార్ట్‌గేజ్ చేయించాను. వారు కోరిన విధంగా పత్రాలు అందజేశా. అప్పు కోసం రోజూ తిరుగుతున్నా. ఇంత వరకు రుణం ఇవ్వలేదు. అధికారులు పంట రుణం ఇవ్వమని చెబితే ప్రత్యామ్నాయం మార్గం చూసుకునే వాడిని. **- ఎం. సుధాకర్ , రైతు, కొప్పర్రు**

జాప్యం వాస్తవమే

రైతులకు రుణం మంజూరు నిమిత్తం నిబంధనల ప్రకారం సంబంధిత పత్రాలు సేకరించాం. అయితే పీఐసీ అందుబాటులో లేకపోవడం వల్ల రుణ మంజూరుకు జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. త్వరలో సమస్య పరిష్కరిస్తాం.
- భాస్కరరావు, సీఈవో, పెదనందిపాడు, సొసైటీ

అవీ ఇవీ

ముగిసిన 'ఈ-క్వెస్ట్'

వింజనంపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఈ-క్వెస్ట్ కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఈసందర్భంగా కిట్స్ ఛైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన వ్యాపార ఆలోచనలు రేకెత్తించడానికి, సరికొత్త ప్రణాళికల రూపకల్పనకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ పి. బాబు, అకడమిక్ సంచాలకులు హరిబాబు పాల్గొని మాట్లాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

పెదకొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, చరవాణికి వచ్చిన ప్రతి లింకునూ తెరవద్దని కేఎల్‌యూ విద్యార్థులు శుక్రవారం పెదకొండూరు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు అవగాహన కల్పించారు. కేఎల్‌యూ సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించి తెలిసిన వారి గొంతుతో మాట్లాడించి మీ ఖాతాల్లో నగదును దోచుకునే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించారు.

మెగా వైద్య శిబిరం

తుళ్లూరు, న్యూస్‌టుడే: కాటూరి మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వెలగపూడిలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొబైల్ హెల్త్ యూనిట్ ద్వారా ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆధునిక పరికరాలు ఉన్న పెద్ద వాహనంలో ఎక్స్‌రే, ఈసీజీ, ఎకో, ఈఎన్‌టీ, బీపీ, షుగరు వంటి పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గురు, శుక్రవారాల్లో సుమారు వెయ్యి మంది శిబిరానికి వచ్చారు. తెదేపా నాయకులు కారుమంచి నరేంద్ర, వెంకయ్య, అప్పయ్య, ఇడుపులపాటి సీతారామయ్య తదితరులు సహకారమందించారు.

దాతకు సత్కారం

ఈమని(దుగ్గిరాల), న్యూస్‌టుడే: ఈమని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన చీదెళ్ల నత్యనారాయణ శుక్రవారం మైక్ సెట్ అందించారు. గతంలోనూ స్కూలుకు పలుసార్లు వితరణ చేశారు. ఆయను హెచ్‌ఎం ఝాన్సీవాణి, ఉపాధ్యాయులు సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

తాడికొండ, న్యూస్‌టుడే: కంతేరు గ్రామ శివారు అండర్ పాస్ వద్ద సమస్యలను పరిష్కరించాలని తెదేపా సీనియర్ నాయకుడు వాసిరెడ్డి జయరామయ్య శుక్రవారం ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. జిల్లా ఎంపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసి ఇబ్బందులను వివరించారు. వీధి దీపాలు ఏర్పాటు, వర్షపు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

'రాష్ట్రంలో కక్షపూరిత పాలన'

మంగళగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కక్షపూరిత పాలన చేస్తున్నారని మంగళగిరి నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదం అంశాన్ని చంద్రబాబు అపవిత్రం చేస్తున్నారని, ఆయన పాపాన్ని పక్షాళనం చేసేందుకు శనివారం మంగళగిరి నృసింహస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సామూహిక కుంకుమార్చన



పూజలో మహిళలు

నల్లమేకలవారి పాలెం(దుగ్గిరాల), న్యూస్‌టుడే: తితిదే స్థానం ధార్మిక ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో శుక్రవారం ఈమని శివారు గ్రామం నల్లమేకలవారి పాలెంలో సామూహిక కుంకుమార్చన చేశారు. ప్రచార పరిషత్తు జిల్లా సమన్వయకర్త అమ్మడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విదార్థినులకు రక్షణ '1098'

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని మందపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్ వైజర్ చిన్న కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆడపిల్లలకు ఏదైనా ఆపద వస్తే 1098 నంబరుకు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చునని తెలిపారు. విద్యార్థినులకు చెడు, మంచి స్పర్శలను వివరించారు. ప్రధానోపాధ్యాయిని శాంతిభూలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఆపాలని తీర్మానం

మేడికొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని సిరిపురంలో శుక్రవారం గ్రామ సభ జరిగింది. సిరిపురం సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక రైల్వే స్టేషన్లో పల్నాడు సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ (గుంటూరు-వికారాబాదు)కు స్టాప్ ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సంబంధించిన పత్రాలను రైల్వే శాఖ అధికారులకు, నాయకులకు అందజేస్తామని సభ్యులు తెలిపారు.

గుర్రం జాషువా జయంతి

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరులో సీఐటీయూ నాయకులు కవి గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కార్మికులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వరద బాధితులకు పరామర్శ



గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న శ్యామ్యూల్

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'ఫోరమ్ ఫర్ ఆర్టీఐ' చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర సమాచార కమిషనర్ పత్తిపాటి శ్యామ్యూల్ జోనాథన్ కొనియాడారు. శుక్రవారం ఉద్దండరాయునిపాలెం లంక గ్రామంలో వరద బాధితులకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్రమోహన్ ఆధ్వర్యంలో దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. శ్యామ్యూల్ ముఖ్యఅతిథిగా పాల్గొని బాధితులను పరామర్శించారు. డా.పి అశోక్ కుమార్, నల్లగొండ రాము, పులి చినబాబు, విక్టర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలువూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: రైల్లో నుంచి జారి పడిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం కేరళ ఎక్స్‌ప్రెస్ చిలువూరు రైల్వేస్టేషన్ దాటగానే పట్టాల పక్కనే గుర్తుతెలియని వ్యక్తి పడి ఉండడాన్ని గమనించిన కొందరు స్థానికులు గేట్ కీపర్ ప్రకాష్‌కు తెలిపారు. ఆయన వెంటనే 108కి సమాచారం ఇచ్చారు. దుగ్గిరాల 108 ఈఎంటీ ఆనంద్, పైలెట్ ప్రసాద్‌రాజు, రైల్వే సిబ్బంది, స్థానికులు కలిసి అతన్ని పట్టాల దగ్గర నుంచి వాహనంలోకి తరలించారు. గాయపడిన వ్యక్తిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని అంటున్నారు. ఎక్స్‌ప్రెస్ నుంచే అతను పడి ఉంటాడని చెబుతున్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరికి..

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: చీరాల- కారంచేడు మార్గంలో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన ఎం.నాగరాజు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి చీరాల నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా బైకు అదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు అక్కడి వారు వెల్లడించారు. తలకు తీవ్ర గాయమైన క్షతగాత్రుడిని 108 వాహనంలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

పెదవడ్లపూడి(మంగళగిరి), న్యూస్‌టుడే: నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పెదవడ్లపూడి గ్రామానికి చెందిన జాస్తి వెంకటేశ్వరరావుకు రూ.1.50 లక్షలు, తాడిశెట్టి సదాశివరావుకు రూ.30 వేలు సీఎం సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి నుంచి నగదు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేశ్‌కి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ, పెదవడ్లపూడి తెదేపా నాయకులు పాల్గొన్నారు.



మంగళగిరి: చెక్కును బాధితులకు అందజేస్తున్న పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య

ఈమని(దుగ్గిరాల), న్యూస్‌టుడే: ఈమనిలో అనారోగ్యంతో బాధపడుతున్న కోటిపల్లి ఆదిలక్ష్మి అనే మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 51,300 వచ్చాయి. ఈ చెక్కును మంత్రి నారా లోకేశ్ స్థానిక నాయకుల ద్వారా శుక్రవారం పంపారు. పార్టీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మండల పరిషత్తు ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య, తాళ్ల అశోక్, కాబోతు దేవదాసు, కాసరనేని కృష్ణ తదితరులు అందించారు.



ఈమనిలో తెదేపా నాయకులు శ్రీఅనిత..

తెనాలి

•తెనాలి •పొన్నూరు

దాతల స్ఫూర్తిని దహనం చేశారు

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులు కూర్చునేందుకు దాతలు ముందుకు వచ్చి 100కు పైగా కుర్చీలను అందుబాటులోకి తెచ్చారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తరవాత ఆ పార్టీలోని ముఖ్య నేత వైద్యశాలకు వచ్చిన సమయంలో పసుపు రంగు కుర్చీలను తొలగించాలని ఆదేశించారు. వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద ఉద్యోగి, వైకాపా నాయకుడు దాతలు ఇచ్చిన కుర్చీల్లో కొన్నింటిని మంటల్లో వేసి దహనం చేశారు. మరి కొన్నింటిని వైకాపా నాయకుడు మాయం చేశాడు. ఈ విషయమై దాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి దాతలు ఇచ్చిన కుర్చీలను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

వరద బాధితులకు విద్యార్థుల సాయం

పొన్నూరు, న్యూస్‌టుడే: విజయవాడలోని వరద బాధితులకు పొన్నూరు సెయింట్ ఆన్స్ విద్యార్థులు రూ.2.50 లక్షలు విలువ చేసే నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ రీనాఆన్ శుక్రవారం వెల్లడించారు. విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.



నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం



ఈనాడు మీతోడు

ఈనెల 28వ తేదీ శనివారం ఈనాడు ఆధ్వర్యంలో 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ పాల్గొని ప్రయాణికులు ప్రస్తావించే సమస్యలకు సమాధానాలు ఇస్తారు. ప్రయాణికులు ఫోన్ చేసి తెనాలి డిపో పరిధిలో బస్సుల రాకపోకలు, ఇతర సమస్యలను ప్రస్తావించొచ్చు. సూచనలు, సలహాలు తెలియజేయొచ్చు.

ఫోన్ చేయాల్సిన సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు: 99592 25422, 80085 73125

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

బాధితులందరికీ పరిహారమివ్వాలని వినతి

పెదకాకాని, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన ప్రతి కుటుంబానికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శివాజీ కోరారు. స్థానిక సుందరయ్య కాలనీలోని వరద బాధితుల్లో కొందరికే బ్యాంకు ఖాతాలో పరిహారం జమ అయ్యిందని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ సహాయకుడు ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు.

తాగునీరు కలుషితం.. అంటువ్యాధుల భయం

మొక్కుబడిగా క్లోరిన్ పరీక్షలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణంలో తాగునీటి పరీక్షలు తూతూ మంత్రంగా చేస్తున్నారు. తరచూ లీకవుతున్న పైపులు సకాలంలో మరమ్మతులు చేపట్టని వార్డుల్లోని కుళాయిల నుంచి వచ్చే నీరు తాగిన ప్రజలు టైఫాయిడ్, ఇతర అంటువ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు యుద్ధప్రాతిపదికన తాగునీటి పైపుల లీకులు మరమ్మతులు చేయించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఖాళీల భర్తీ ఎప్పటికో..? మున్సిపాలిటీ పరిధిలోని 47 వార్డు సచివాలయాల్లోని ఇంజినీరు రోజూ తాగునీటి కుళాయిల నుంచి నీరు వచ్చే సమయంలో వాటిని పట్టి క్లోరిన్ పరీక్ష నిర్వహించాలి. రోజూ ఎన్ని కుళాయిల వద్ద చేసిందీ వివరాలతో సహా జిల్లా గ్రూపులో ఫొటోతో సహా పెట్టాలి. వీరు ఆ విధులను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. దీనికి కారణం వార్డు సచివాలయాల ఇంజినీర్లు, మున్సిపల్ ఇంజినీర్లలో ఎక్కువ మంది ఇతర ప్రాంతాల నుంచి వస్తుండడమే. కొందరు సచివాలయాల ఇంజినీర్లు విధులకు వెళ్లగా, మరి కొందరు మృతి చెందారు. ఇంకొందరు వ్యక్తిగత సెలవులో ఉన్నారు. వీరి బాధ్యతలను పక్క వార్డుల్లో వారికి అప్పగించారు. ఈ ఖాళీలు భర్తీ చేయకపోవడంతో వారికి అదనపు భారం అయిందని వాపోతున్నారు.



చెంచుపేట మంచినీటి పథకం వద్ద పైపు నుంచి లీకవుతున్న నీరు



ఇటీవల నీట మునిగిన ఎస్టీ బాలికల గురుకులం (తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వలేదు)

పట్టణంలోని రక్షిత మంచినీటి ట్యాంకులు	:	7
తాగునీటి కుళాయిలు	:	13,521
జనాభా	:	1.75 లక్షలు
గృహాలు	:	43,254

తెనాలి ఆసుపత్రిలో టైఫాయిడ్ పరీక్షల వివరాలు

నెల	చేసినవి	పాజిటివ్
జూన్	117	10
జులై	218	24
ఆగస్టు	618	84

అధికారుల తీరిది

మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం.. చెంచుపేటలోని రక్షిత మంచినీటి పథకం వద్ద భూగర్భంలోని పైపు లీకై తాగునీరు సీసీ రోడ్డు కింద నుంచి ఉబికి పైకి వస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే రావి రవీంద్రనాథ్ ఇంటి రోడ్డులో పడిన లీకు నుంచి నీరు మురుగు కాలువలో కలుస్తున్నాయి. బుర్రిపాలెం రోడ్డులోని ఐరన్ తాగునీటి గొట్టాలు లీకై నీరు వృథాగా పోతోంది. ఇవి చిన్నవేనని మరమ్మతులు చేయించకుండా వదిలేశారు. కృష్ణా నదీ జలాలను పట్టణానికి తెచ్చి దశాబ్దం అవుతున్నా స్థానిక ప్రభుత్వ భవనాల్లోని ఎస్సీ, ఎస్టీ బాలుర, బాలికల వసతి గృహాలు, గురుకులాలకు మున్సిపల్ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదు. ఇటీవల రామలింగేశ్వరపేటలోని పులిపాటి వారి వీధిలో తాగునీటి పైపు లీకైందని చెప్పిన మూడ్రోజుల తరవాత అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. అప్పటి వరకు తాగునీరు వృథా అవుతూనే ఉంది.

★ తాగునీటి పైపుల లీకులు గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నారు. అధికారులు గుర్తించనవి ఉంటే సమాచారం ఇస్తే వెంటనే స్పందించి మరమ్మతులు చేయిస్తామని మున్సిపల్ ఇంజినీర్ (ఎంఈ) ఆకుల శ్రీనివాస్ న్యూస్‌టుడేకు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణంలోని టీచర్స్‌కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో ఒంటరిగా బయటకు రావాలంటే భయమేస్తోంది. **-పి.పద్మజ, టీచర్స్‌కాలనీ**

✔ సమస్యను పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటా. **-శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి**

? భావనగర్‌కాలనీలో మూడు రోజులు నుంచి చెత్త తొలగించడం లేదు. చెత్త రహదారి పైకి రావడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. **- పి.రవికుమార్, భావనగర్‌కాలనీ**

✔ చెత్త తొలగిస్తాం. **-శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి**

-న్యూస్‌టుడే, పొన్నూరు

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. ■ 29వ వార్డు ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త ■ నేతాజీనగర్‌లోని మురుగు కాలువలోని వ్యర్థాలను తొలగించారు. **-న్యూస్‌టుడే, పొన్నూరు**

? స్థానిక సాలిపేట, మల్లాప్రగడ వారి వీధిలో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రి వేళ పాదచారులు వెళ్తుంటే వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంటోంది. **-రాజేష్, స్థానికుడు**

✔ వెంటనే మరమ్మతులు చేయిస్తాం. **-శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, చేబ్రోలు**

? ఉప్పరపాలెం, మఠం బజారు ప్రాంతంలో మురుగు కాల్వల్లో పూడిక తీసి అలాగే వదిలేస్తున్నారు. వర్షాకాలం కావడంతో పూడిక రోడ్లపైకి చేసి నడవాలంటేనే ఇబ్బందిగా ఉంటోంది. **-శివ శంకర్, స్థానికుడు**

✔ సమస్యను వెంటనే పరిష్కరిస్తా. **-శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, చేబ్రోలు** **- న్యూస్‌టుడే, చేబ్రోలు**

మురికి కూపంలా కంపోస్టుయార్డు



ఇటీవల రూ. లక్షలతో మరమ్మతులు చేయించిన చెత్త సర్దుబాటు చేసే పొక్లెయిన్ మరోసారి మొరాయించింది. దీనికి బదులు అద్దె పొక్లెయిన్ ఏర్పాటు చేయగా.. అదీ పనిచేయడంలేదు. మున్సిపాలిటీ ట్రాక్టర్లపై కంపోస్టుయార్డుకు తీసుకొచ్చిన చెత్తను సర్దుబాటు చేసే యంత్రం లేక రోడ్డుపై కుమ్మరించారు. ఇది గుట్టలుగా పేరుకుపోయి మురికి కూపంలా తయారైంది. వైకాపా ప్రభుత్వ హయాంలో చెత్త సర్దుబాటు చేసే పొక్లెయిన్ మరమ్మతు పనులను అనుకూల గుత్తేదారులకు అప్పగించగా ప్రజాధనం రూ. 25 లక్షల పైన ఖర్చు చేశారు. తరచూ పొక్లెయిన్ మొరాయింపు, మరమ్మతులకు భారీగా నిధుల ఖర్చు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)

సచ్చిదానందమూర్తి నేటి యువతకు ఆదర్శం



సచ్చిదానందమూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లావు రత్తయ్య తదితరులు

పొన్నూరు, న్యూస్‌టుడే: భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేసిన పద్మవిభూషణ్ గ్రహీత సచ్చిదానందమూర్తి నేటి యువతకు స్ఫూర్తిదాత అని విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్య పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శుక్రవారం అచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచ్చిదానందమూర్తి గుర్తుగా యూనివర్సిటీ లైబ్రరీలో ఆయన పేరు మీద ఇప్పటికే ఒక బ్లాక్‌కు ఏర్పాటు చేశామని వెల్లడించారు. నేటి విదార్థులు సచ్చిదానందమూర్తి బోధనలను జీవితంలో అన్వయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపకులపతి పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్.రఘునాథన్ తదితరలు పాల్గొన్నారు.

రోగాల బారిన పడకుండా అప్రమత్తం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రోగాల నివారణ కమిటీ కేంద్ర బృందం వైద్యులు డాక్టర్ సతీష్‌కుమార్ సూచించారు. శుక్రవారం జిల్లా ఆసుపత్రిలోని తల్లీపిల్లల ఆరోగ్య విభాగంలోని పలు వార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది తీసుకుంటున్న జాగ్రత్తలు అడిగి తెలుసుకున్నారు. దస్త్రాల నిర్వహణను పరిశీలించారు. హెల్త్ స్క్రీనింగ్ పరీక్షల గురించి వాకబు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ టి.సౌభాగ్యవాణితో సమావేశమయ్యారు.

మాల ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో మాల ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఇబ్బంది పెడుతున్నారని, ఇది సరి కాదని దళిత హక్కుల సేవా సమితి అధ్యక్షుడు బి. బుల్లియ్య తెలిపారు. పట్టణ ఐతానగర్‌లో శుక్రవారం తెనాలి డివిజన్ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక సమితి ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న స్థానిక సామాజిక భవనంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావాలని ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు.

30న కలెక్టరేట్ వద్ద ధర్నా

పొన్నూరు, న్యూస్‌టుడే: ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు పేర్కొన్నారు. పొన్నూరు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఈ నెల 30వ తేదీన గుంటూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు.

మొక్కలు నాటిన వాలంటీర్లు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కలు నాటారు. సైన్స్ కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. అక్టోబరు2 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగిస్తామని ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ దివ్యతేజోమూర్తి చెప్పారు. డాక్టర్ యుగంధర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీశాఖ ఏఈగా గోగినేని బాధ్యతల స్వీకరణ



పొన్నూరు, న్యూస్‌టుడే: రోడ్డు భవనాల శాఖ పొన్నూరు సహాయ ఇంజినీర్‌గా గోగినేని శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్లలో ఏఈగా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈయన గతంలోనూ ఏఈగా ఇక్కడ విధులు నిర్వహించారు.

సీఎంఎంగా హనుమాన్ నాయక్..



పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు మెప్మా సిటీ మిషన్ మేనేజర్‌గా డి.హనుమాన్ నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల మెప్మా విభాగంలో ఆయన పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయన గతంలోనూ పొన్నూరులో సీఎంఎంగా విధులు నిర్వహించారు.

గ్రామీణ ఎస్సై-2గా బురాన్ షరీఫ్



తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఎస్సై-2గా షేక్ బురాన్ షరీఫ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1984లో పోలీస్ విభాగంలోకి కానిస్టేబుల్‌గా చేరిన ఆయన 2011లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2015లో ఏఎస్సైగా వివిధ స్టేషన్లలో విధులు నిర్వహించి ఉద్యోగోన్నతిపై తెనాలి వచ్చారు. సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

టీపీవో సాంబశివరావు..

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఒంగోలు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు బదిలీపై తెనాలి పురపాలిక సంఘానికి వచ్చారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసే టీపీవో రాజ్యలక్ష్మి చీరాలకు వెళ్లారు.

ఐక్యా 2కే24 సాంకేతిక సదస్సు



సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు

పెదకాకాని, న్యూస్‌టుడే: రోజు రోజుకు పెరుగుతున్న 6 జీ, కృత్రిమ మేధ వంటి సాంకేతికతను సరైన మార్గంలో మానవాళి అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని ఐఈటీఈ విద్యార్థి విభాగం ఛైర్మన్ డాక్టర్ సూర్య ప్రసాద్ అన్నారు. మండలంలోని నంబూరు వీవీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఈటీఈ విద్యార్థి విభాగంలో శుక్రవారం ఐక్యా 2కే24 సాంకేతిక సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే ఈ సదస్సులో డైవ్‌ఇన్‌థాట్స్, బ్రేకింగ్ కోడ్స్, మిస్టరీ లూట్, క్రియేటివ్ క్లాష్ వంటి 15 సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ మల్లికార్జున రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ భానుమూర్తి, ఐఈటీఈ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, ప్రజారోగ్యానికి సహకరించాలి



ఉద్యోగులు, స్థానికులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: తడి, పొడి, హానికర చెత్త మురుగు కాలువల్లో పడేయకుండా, డబ్బాల్లో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. ఆమె పట్టణంలోని 16, 17, 20, 30 వార్డుల్లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణ పరిశుభ్రతకు, ప్రజారోగ్యానికి ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా జనం, అధికారులు, ఉద్యోగులు మానవహారంగా ఏర్పడగా ఆమె స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అమరావతి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, సహాయ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణి హెలెన్ నిర్మల, ఎంఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో మౌలిక వసతులు కల్పిస్తాం



మాట్లాడుతున్న కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రజల అవసరార్థం మౌలిక వసతులు కల్పించే విధంగా తగు చర్యలు తీసుకుంటానని కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం 24, 26వ వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తామని వెల్లడించారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం 5వ వార్డులో అన్న క్యాంటీన్‌లో భోజనం పరిశీలించారు. మాజీ కౌన్సిలర్ ఆలపర్తి చంద్రమోహన్, షేక్ జానీబేగ్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పర్యాటక రంగంలోనే ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య సురేష్‌కుమార్ చెప్పారు. ఏఎన్‌యూలోని టూరిజం, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన హైందవి, మౌనిక, రోహిత్‌లకు సురేష్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పూర్ణచంద్రరావు, డాక్టర్ రెహమాన్, జ్యోతి, గీతాసోని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: దేశ ప్రగతిలో పర్యాటక రంగం కీలకమని, మన దేశం ఈ విభాగంలో గణనీయమైన ప్రగతి సాధిస్తుందని కొలకలూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. ప్రపంచ పర్యాటక రంగ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా వేయించుకోవాలి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా వేయించుకోవాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం డొంకరోడ్డులోని చర్చిలో నిర్వహించిన క్షయ, బీసీజీ టీకా వల్ల కలుగు ప్రయోజనాల పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. వృద్ధులలో చక్కెర వ్యాధితో బాధపడుతున్న వారు, పొగాకు తీసుకునే వారు, క్షయ వ్యాధిగ్రస్థులు బీసీజీ టీకా వేయించుకోవాలని ఆయన సూచించారు.

అభ్యంతరాలు తెలియజేయండి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ సర్వే నంబరు 617లోని రావి రవీంద్రనాథ్ నగర్‌లో ఇప్పటికే ప్రజల రాకపోకల కోసం వినియోగించుకుంటున్న స్థలంపై అభ్యంతరాలు ఉన్న వారు, ఏడు రోజుల్లో మున్సిపల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా కమిషనర్‌కు దాఖలు పరచాలని కమిషనర్ శేషన్న ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం సదరు స్థలంలో నోటీసు ప్రతిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు కొలకలూరులో ఉచిత వైద్య శిబిరం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెనాలి మండలం కొలకలూరులో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకుజొన్నలగడ్డ స్వర్ణముఖి స్మారక ఉచిత వైద్య శిబిరాన్ని గుంటూరు ఆంధ్రాప్రైమ్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు, నరములు, కంటి, మధుమేహ, రక్తపోటు తదితర విభాగాల నిపుణులైన వైద్యులు వస్తారని, పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తామని వివరించారు.

సామూహిక కుంకుమార్చన

దుగ్గిరాల: తితిదే స్థానం ధార్మిక ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో శుక్రవారం ఈమని శివారు గ్రామం నల్లమేకలవారిపాలెంలో సామూహిక కుంకుమార్చన చేశారు.

61 శాతం రేషన్ దుకాణాలకు సరకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అక్టోబరు 1 నుంచి కార్డు దారులకు రేషన్ పంపిణీకి సంబంధించి తెనాలి డివిజన్ పరిధిలో 61 శాతం తరలింపు పూర్తి అయినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం తెనాలి గోదాములో రికార్డులు పరిశీలించారు. డివిజన్‌లో 231 దుకాణాలకు సంబంధించి 141 దుకాణాలకు తరలింపు పూర్తి అయిందని వివరించారు. ప్రజా ఫిర్యాదులు, పరిష్కారాల కార్యక్రమంలో తెనాలి మండలం అంగలకుదురు నుంచి వచ్చిన భూ వివాద సమస్యను నేరుగా పరిశీలించటానికి ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొలకలూరులో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో తహసీల్దార్ మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి ప్రేమసాగర్ పర్యవేక్షించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: విజయకుమార్ అనే అనాథ మృతదేహానికి త్రీ టౌన్ పోలీసుల వినతి మేరకు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించినట్లు శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను తెలిపారు.

వరుస వర్షాలతో రైతుల్లో ఆందోళన

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వరుస వర్షాలతో నేలపాడు వరిపొలాలకు ఎగువ నుంచి భారీగా నీరు వచ్చి పడుతోంది. ఇటీవల వరదలతో పది రోజులు పైగా నీటమునిగి దెబ్బతిన్నాయి. ఆ నీటిని బయటకు మళ్లించి పై నాటు వేయించారు. గత వారం నుంచి రోజూ పడుతున్న వానలతో మళ్లీ ఆ చేలల్లోకి పై నుంచి వస్తున్న నీటితో మునుగుతుందేమోననే రైతులు శుక్రవారం ఆ నీటిని బయటకు తోడిస్తున్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అంగలకుదురులో సొసైటీ ఆఫ్ విన్సెంట్ డి.పాల్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. గురువులు శౌరీరాజు, సునీల్, రవిచంద్రబాబు పర్యవేక్షించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోండి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టభద్ర ఓటర్ల ఫాం 18 ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో తమ ఓట్లు నమోదు చేయించుకోవాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం పిలుపు ఇచ్చారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో వీడియోను విడుదల చేశారు.

ప్రయాణం.. నరకప్రాయం

కొల్లిపర, తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గుంటూరు వయా హనుమాన్‌పాలెం రెండు వరుసల రహదారి భారీ గుంతల నడుమ వాహన చోదకులు బాటను వెతుక్కోవాల్సి వస్తోంది. భారీ వాహనాలు వెళ్లేందుకు మొరాయిస్తున్నాయి. చిన్నకార్లు దారి మళ్లించే ప్రయత్నంలో గుంతల నడుమ కూరుకుపోయి మరమ్మతులకు లోనవుతున్నాయి. ద్విచక్రవాహన చోదకులు సైతం పలుమార్లు గాయాలపాలవుతున్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రహదారి నిర్వహణకు ప్రభుత్వం ఒక్క రూపాయి విదిల్చలేదు. గుంటూరు నుంచి హనుమాన్‌పాలెంకు దూరం 36 కిలోమీటర్లు. గుంటూరు నుంచి వెంకటకృష్ణాపురం వరకు రహదారి కొంతమేర వాహనచోదకులకు ఊరటనిచ్చినా.. ఆఫ్‌పేట, కాజీపేట, కొలకలూరు, కోపల్లెగుడివాడ అడ్డరోడ్డు, నందివెలుగు, అత్తోట, చివలూరు, దావులూరు అడ్డరోడ్డు వరకు అధ్వానంగా మరి వాహన చోదకులకు నరకానికి బాటలు వేసినట్లుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారిపై తారుపూత కొట్టుకుపోయి రాళ్లు తేలుతున్నాయి. భారీ గుంతల్లో నీరు నిలిచింది. గుంతలలోతు తెలియక దిగిన వాహనాలు ముందుకు కదలటంలేదు. అధికారులు ఇప్పటికైనా కనీసం మరమ్మతు పనులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



చివలూరు కూడలిలో..



తెనాలి మండలం కొలకలూరు వద్ద

కాలువ కట్ట బలహీనం



వైకుంఠపురం-చినరావూరు తోట కాలువ కట్ట బలహీనపడింది. వరదల సమయంలో కాలువలో ఉద్ధృతంగా నీరు ప్రవహించిన క్రమంలో కరకట్ట పూర్తిగా మెత్తబడింది. ఏదైనా ఒక ప్రాంతంలో కట్ట తెగినా చినరావూరు తోట నివాసాలు మొత్తం మునిగిపోతాయి. నీటి పారుదల విభాగ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నష్టం జరగక ముందే సమస్యను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

నాజరుపేట ఘర్షణపై విచారణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ నాజరుపేటలో రెండు మందిరాల నిర్వాహకుల నడుమ జరిగిన గొడవ, అందులో ఒకరు తీవ్రంగా గాయపడిన కేసుకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. గురువారం రాత్రి కేసులో నిందితుడిని విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన క్రమంలో పలువురు యువకులు అక్కడకు వచ్చి పోలీసులతో వాగ్వివాదానికి దిగినట్లు తెలిసింది. గాయపడిన సుబ్బారావుకు స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కొనసాగుతుంది.

దస్తావేజు పోయినది

నా క్లయింటు అయిన బాపట్ల జిల్లా, అమృతలూరు(మం), గ్రామము, డి.నెం.7-37/1 కాపురస్తురాలైన శ్రీ మాచిరాజు శేషగిరిరావు గారి భార్య శ్రీమతి మాచిరాజు విజయలక్ష్మి గారి సంజాయిషీ పొంది తెలియజేయునది. మాచిరాజు విజయలక్ష్మి గారికి తెనాలి టౌన్, చెంచుపేట అమరావతి ఫ్లాట్స్‌లోగల 1వ వార్డు, 1వ బ్లాకు, టి.ఎస్.నెం.31/5, ఫ్లాట్ నెం. ఈడబ్ల్యూఎస్ సి-82 నందు డి.నెం.10-34-1, 106.6 గ॥లో నిర్మించిన ఆర్.సి.సి. డాబాగల ఇంటియొక్క రిజిష్టరు దస్తావేజు నెం. 1708/1990 ఆఫ్ తెనాలి ఎస్.ఆర్.ఓ.(713) విక్రయ దస్తావేజు కొల్లిపర రిజిష్టరు ఆఫీసునకు వెళ్ళివచ్చుచుండగా తేది:27.09.2024న పోయినది. దస్తావేజులు ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు ఇవ్వగలరు.

రావూరి దయాకిరణ్, అడ్వకేట్, తెనాలి.
Ph: 99858 42882

గుంటూరు పశ్చిమ


ధర వరలు



పట్టాభిపురం, న్యూస్‌టుడే: కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో) టమాట 44, వంగ 34, బెండ 19, పచ్చిమిర్చి 20, కాకర 46, క్యారెట్ 42, బీర 44, క్యాబేజి 24, దొండ 34, బంగాళదుంప 38, ఉల్లిపాయలు 45, గోరుచిక్కుళ్లు 37, దోస 26, సొర 22, పొట్లకాయ 29, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 46, బీట్‌రూట్ 27, క్యాప్సికం 59, బీన్స్ 64, కీరదోసకాయ 29, కొత్తిమీర 40, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 50, అల్లం 70, వెల్లుల్లి 320.

ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

అధికారుల పని తీరుపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆగ్రహం



గెలాక్సీ బార్ పక్క రహదారి విస్తరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'ప్రభుత్వం మారి 100 రోజులు దాటినా కొందరు అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇది సమంజసం కాదు. విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. పని తీరు మార్చుకోనివారు ఇప్పటికైనా మార్చుకొంటే మంచిది'.. అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులకు హితవు పలికారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని చుట్టుగుంట, ఏటీ అగ్రహారం, జోసఫ్‌నగర్, లక్ష్మీనగర్‌లో ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి పర్యటించి ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. నల్లపాడు రహదారిలోని డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను చూసి ఎందుకు తొలగించడం లేదని అధికారులను ప్రశ్నించారు. డ్రెయిన్ల సామర్థ్యం పెంచకపోవడంతో మురుగునీరు పొంగి రోడ్ల మీదకు చేరుతుందని చుట్టుగుంట రైతుబజార్ సమీప ప్రాంతాలవాసులు వాపోయారు. జోసఫ్ నగర్ వాసులు సైడు కాల్వలు నిర్మించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును 60 అడుగులకు విస్తరించాకే డ్రెయిన్లు అభివృద్ధి చేయాలని నగరపాలక సంస్థ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ 'ఇటీవల సంభవించిన వరదల వల్ల ఈ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. నిర్ణీత కాలవ్యవధి పెట్టుకుని సమస్యల పరిష్కారానికి పని చేయాలి. గుంటూరును క్లీన్ సిటీగా మార్చేందుకు సహకరించాలి'.. అని ఆదేశించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ జోసఫ్‌నగర్‌లో చెరువు వల్ల ఇళ్లలోకి వరద వస్తోందన్నారు. ఈ సమస్యను ఏవిధంగా అధిగమించాలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. డ్రెయిన్లు అస్తవ్యస్తంగా ఉన్న ప్రాంతాల్లో ప్రాధాన్యం మేరకు వాటిని నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని, రోడ్ల విస్తరణ అవసరం ఉన్న ప్రాంతాల్లో ముందుగా ఆ పనులు చేపడతామని చెప్పారు. పెమ్మసాని సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని వివరించారు. ఇందులో భాగంగా శంకరవిలాస్ ఓవర్‌బ్రిడ్జి విస్తరణ, శ్యామలనగర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు నిరంతరం చర్చిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఆరంభం అదిరే..!

మొదటి బ్యాచ్‌లోనే కిట్స్, కిట్స్ అక్షర్ ఎన్‌సీసీ క్యాడెట్లు 100 శాతం ఉత్తీర్ణత



కిట్స్ క్యాడెట్లకు ఆయుధాల శిక్షణ ఇస్తున్న అబ్దుల్లా బేగ్

మారుతీనగర్, న్యూస్‌టుడే

ఏ రంగంలో రాణించాలన్నా పట్టుదల, అంకితభావం అవసరం. లక్ష్య సాధనకు కృషి, కఠోర సాధన తోడైతే విజయాన్ని సొంతం చేసుకోవచ్చని నిరూపిస్తున్నారు ఆ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు. చదివేది యంత్ర విద్య అయినా సహ పాఠ్యాంశం ఎన్‌సీసీలో రాణిస్తూ అభివృద్ధి దిశగా సాగుతున్నారు. ఎన్‌సీసీలో గణతంత్ర, తల్‌సైనిక్, నాయకత్వం, పర్వతారోహణ, ఆర్మీ ఎటాచ్‌మెంట్, ఏక్‌భారత్ శ్రేష్ఠభారత్ వంటి జాతీయ స్థాయి శిబిరాలకు హాజరవడమే కాకుండా ధ్రువపత్రాల సాధనలో నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న కిట్స్, కిట్స్ అక్షర్(గుంటూరు ఇంజినీరింగ్ కళాశాల) ఎన్‌సీసీ క్యాడెట్ల గురించి తెలుసుకుందాం.

25వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఈ రెండు కళాశాలల్లో 2022-23 విద్యాసంవత్సరం నుంచి ఎన్‌సీసీని ప్రారంభించారు. కిట్స్ కళాశాలలో మేకల సతీష్‌కుమార్ నేతృత్వంలో 80 సీట్లు, కిట్స్ అక్షర్ కళాశాలలో బిళ్ల మల్లికార్జునరావు నాయకత్వంలో 52 సీట్లు కేటాయించారు. మొదటి సంవత్సరంలో కిట్స్ నుంచి 25 మంది మంది, కిట్స్ అక్షర్‌లో 17 మంది ప్రవేశాలు పొందారు. మొదటి సంవత్సరంలో కళాశాల స్థాయిలో శిక్షణ పొందిన క్యాడెట్లు రెండో ఏడాదిలో కళాశాల శిక్షణతో పాటు కనీసం 10 రోజుల వ్యవధి గల ఒక శిక్షణ శిబిరానికి హాజరై 'బి' సర్టిఫికెట్ పరీక్షకు అర్హత సాధించారు. 'బి' సర్టిఫికెట్ ఫలితాల్లో కిట్స్‌లో 'ఎ' గ్రేడ్-6, 'బి' గ్రేడ్-19, అక్షర్‌లో 17 మందికిగాను 8 మంది 'ఎ' గ్రేడ్, 9 మంది 'బి' గ్రేడ్ సాధించి 2025లో జరిగే 'సి' సర్టిఫికెట్ పరీక్షకు హాజరుకానున్నారు.


ఇటు సాధన.. అటు సేవ..

ఈ రెండు కళాశాలల ఎన్‌సీసీ క్యాడెట్లు ధ్రువపత్రాల సాధనతో సంతృప్తి చెందకుండా ఇండియన్ మిలటరీ అకాడమీ(ఐఎంఏ) విశ్రాంత సుబేదార్ అబ్దుల్లా బేగ్ శిక్షణలో శారీరక దారుఢ్యం పెంపొందించుకొని ముందుకు సాగుతున్నారు. కళాశాల ఆవరణలో జరిగే పరేడ్‌తో పాటు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల కోసం కవాతు, సాంస్కృతిక అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొంది అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. రక్తదానం, మొక్కల పెంపకం, స్వచ్ఛభారత్, వరద బాధితుల సాయం కోసం కళాశాలల్లో విరాళాలు సేకరించడం వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.



'బి' సర్టిఫికెట్ పొందిన కిట్స్ అక్షర్ క్యాడెట్లు

మనోధైర్యంతో ముందడుగు



– పల్లపు గోపీకృష్ణ, తిమ్మాపురం

కిట్స్ కళాశాలలో ఈఈఈ నాలుగో సంవత్సరం చదువుతున్నాను. ప్రస్తుతం 'సి' సర్టిఫికెట్ పరీక్షకు సిద్ధమవుతున్నాను. కళాశాలలో ఎన్‌సీసీ మొదటి బ్యాచ్ మాది. కళాశాల నుంచి ఢిల్లీ గణతంత్ర దినోత్సవాలకు హాజరైన మొదటి క్యాడెట్ కావడం సంతోషం. ఆర్డీసీ ఎంపిక కోసం ఐదు శిబిరాల్లో పాల్గొన్నా. కళాశాలలో చేసిన ప్రాక్టీస్‌కు మనోధైర్యం తోడుకావడంతో ఎంపిక సులువైంది. జనవరి 27న పీఎం ర్యాలీలో ప్రధాని మోదీ ఎదుట కవాతు చేయడం, ఆయన ఇంటి దగ్గర బృంద చిత్రం దిగడం మరచిపోలేని అనుభూతి.

ఆత్మవిశ్వాసం పెరిగింది



– కట్ట కల్యాణి, పాతగుంటూరు

నేను ఈసీఈ చివరి సంవత్సరం చదువుతూ పాతగుంటూరులో ఉంటున్నాను. 'సి' సర్టిఫికెట్ పరీక్షకు హాజరౌతున్నా. ఫైరింగ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఆర్డీసీ పోటీలకు వెళ్లాలని నిర్ణయించుకొని కవాతులో సాధన చేస్తున్నాను. ఎన్‌సీసీలో చేరడంతో శారీరక దారుఢ్యంతోపాటు ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆర్మీలో చేరడానికి 'సి' సర్టిఫికెట్ మంచి అవకాశం. ఆర్మీ అధికారి కావాలనేది నా లక్ష్యం.

విశ్వనరుడు జాషువాకు నివాళి



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు, అతిథులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మహాకవి గుర్రం జాషువాకు నివాళులర్పించారు. బందారు, డి.వి. ఆచంట కళా సమితి సంయుక్త నిర్వహణలో ప్రదర్శితమైన 'విశ్వనరుడు-జాషువా' పద్య నాటకం మహాకవి జీవితంలోని ప్రధానాంశాలను కళ్లకు కట్టినట్లు చూపించింది. [illegible] జాషువాగా డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ తన నటనా చాతుర్యాన్ని చూపించి మన్ననలు అందుకున్నారు. నాటకంలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగా తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, బెజవాడ రామచంద్రారెడ్డిగా డాక్టర్ బీరం సుందరరావు, ఏకా ఆంజనేయులుగా డాక్టర్ జి. జయకుమార్, వీరుభొట్ల సూర్యనారాయణ పాత్రలో కొణితం నాగేశ్వరరావు, అమరేంద్రగా డాక్టర్ జి. రవికుమార్, కొండవీటి వెంకటకవిగా [illegible] నంతో నాటకాన్ని రక్తి కట్టించారు. **రచన, దర్శకత్వం:** డాక్టర్ నరాలశెట్టి రవికుమార్ రచన, దర్శకత్వంలో నాటకం సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో [illegible] పాల్గొని [illegible] వివరించారు. సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు ప్రసంగించారు. అనంతరం నాయుడు గోపి, ఉప్పాల వెంకటరత్తయ్య, గుంటుపల్లి ఆంజనేయచౌదరి, తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, సాంబిరెడ్డి, లొల్లా రమాదేవి తదితరులకు నగదు పురస్కారాలిచ్చి సత్కరించారు.

ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీ



బాక్సులు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపర్చిన గోదామును కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. గోదాముకు సంబంధించిన సీసీటీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. అనంతరం భద్రత సిబ్బంది లాగ్‌బుక్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఆర్వో విజయలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసు, సహాయ అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణారెడ్డి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పింఛనర్ల సంఘాల సాయం



ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి అఖిల భారత తపాలా, ఆర్ఎంఎస్ పింఛనర్ల సంఘం, ఆంధ్రప్రదేశ్ శాఖ నుంచి సేకరించిన విరాళం రూ.2 లక్షలను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యదర్శి నిమ్మగడ్డ నాగేశ్వరరావు, జాతీయ నాయకులు డి.మోహన్‌రావు, రాష్ట్ర నాయకులు కె.వెంకటేశ్వర్లు, ఎం.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బి.రామారావు, తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

97042 53525, 80085 74897

స్పందనకు వందనం

కాల్వలో పూడికతీత: డీఎస్ నగర్‌లోని 1 నుంచి 5వ లైను వరకు ఉన్న కాల్వలో మురుగు పేరుకుపోయింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించి సమస్యను పరిష్కరించారు.

చెత్త తొలగింపు: బ్రాడీపేట 1, 2 వీధుల్లోని మురుగు కాల్వలో చెత్త పేరుకుపోయింది. సమస్యను 'శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాల్వలో చెత్త తీయించి, మురుగు తొలగింపజేశారు.

వ్యర్థాల తొలగింపు: కంకరగుంట వంతెన కింద మెట్ల దగ్గర భవనం వ్యర్థాలు రహదారిపై వేస్తున్నారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్ దృష్టికి తీసుకెళ్లాం. శానిటరీ కార్యదర్శి సంజయ్ నాయక్, సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగింపజేశారు. - **న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం, నగరంపాలెం**

కంకర కుప్పలు.. ప్రజలకు తిప్పలు



చంద్రమౌళీనగర్ ఒకటో లైనులో రాకపోకలకు వీల్లేకుండా భారీగా కంకర కుప్పలు



చెత్తకుప్పలు తొలగించడమే లేదు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

కంకర కుప్పలు నడిరోడ్డుపై పోసి వదిలేశారు. చంద్రమౌళీనగర్ ఒకటో లైనులో అయిదు భారీ కంకర కుప్పలు వరుసగా పోశారు. రాకపోకలకు వీల్లేకుండా రోడ్డుపై వేసి చేతులు దులిపేసుకున్నారు. నెల రోజులైనా వాటి గురించి పట్టించుకునేవారు లేరు. దీంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఒకటో లైనులోని మూడో అడ్డరోడ్డులో కంకర కుప్పలు పోయడంతో వాటిపై ఆకతాయిలు చేరి మద్యం తాగి గొడవ చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా ఉండడంతో ఉన్న తక్కువ జాగాలో వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల టైర్లు జారి ప్రమాదాల బారిన పడుతున్నారు. మరో వైపు చెత్తా చెదారాలు, వ్యర్థాలు సైతం అక్కడే పడేస్తున్నారు. ఓ వైపు కంకర కుప్పలు, మరో వైపు వ్యర్థాల కుప్పలతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి కంకర కుప్పల విషయాన్ని తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఈ ప్రాంతవాసులు వాపోయారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సమస్యల్ని పరిష్కరించాలని కోరుతున్నారు.

క్లస్టర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న కృష్ణప్రసాద్, తదితరులు

నవభారత్‌నగర్(గుంటూరు), న్యూస్‌టుడే: ఆంధ్రా, తెలంగాణ సీబీఎస్ఈ క్లస్టర్ గేమ్స్‌లో భాగంగా బాలుర షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు గుంటూరులోని డాక్టర్ కేఎల్‌పీ పాఠశాల ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం మొదలయ్యాయి. ఏపీ, తెలంగాణ సీబీఎస్ఈ రీజినల్ అధికారి సువిందు శేఖర్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలు జరుతాయని నిర్వాహకులు చెప్పారు. పారా ఒలింపియన్ శ్రీహర్షద్ షేక్, డీఈవో పి.శైలజ, కేఎల్‌పీ పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ జి.రత్తయ్య, వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, పీఈటీలు, రిఫరీలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవంపై పోటీలు

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే: దేశ అభివృద్ధిలో పర్యాటకం ఎంతో కీలకంగా ఉందని, దేశానికి ఆర్థికంగా కూడా ఎంతో ఉపయోగకరంగా ఉందని టీజేపీఎస్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి పేర్కొన్నారు. స్థానిక టీజేపీఎస్ పీజీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు పర్యాటకంపై క్విజ్, ఒక చిత్రం ఇచ్చి దాని సంభాషణలు రాయడం వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ కె.శాస్త్రి, డాక్టర్ నాగ నిర్మల, విజయలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

రాతి ముఖమండప నిర్మాణానికి విరాళం

అద్దంకి, న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ రాతి ముఖమండపం నిర్మాణానికి గుంటూరు వాస్తవ్యులు పెళ్లూరి రవికుమార్-సుభద్ర(పూర్వపు సహాయ కమిషనర్) దంపతులు రూ.1,16,000 చెక్కును శుక్రవారం అందించారు. కమిషనర్ ఎం.తిమ్మానాయుడు దానికి సంబంధించి తగు రసీదు అందజేశారు.

రోడ్డు మరమ్మతులు చేయించండి

గుంటూరు రైల్వే: రైల్ వికాస్ భవన్‌కు వెళ్లే రహదారిని మరమ్మతులు చేయించాలని ద.మ.రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిని కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో సంఘ నాయకులు ఎంవీ ప్రసాద్, కోటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

68 మందికి ఉద్యోగాలు

జిల్లాపరిషత్తు(గుంటూరు): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, న్యాక్, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన ఉద్యోగ మేళాలో 68 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని నైపుణ్యాభివృద్ధి హబ్‌లో ఉద్యోగ మేళా నిర్వహించగా నిరుద్యోగ అభ్యర్థులు 141 మంది హాజరయ్యారన్నారు. ప్రయివేటు కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి 68 మందిని ఎంపిక చేసుకున్నారని వివరించారు.

విధుల్లో చేరిన విద్యుత్తు ఇంజినీర్లు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: గుంటూరు సర్కిల్ కార్యాలయంలో కార్యనిర్వాహక ఇంజినీరు(డీపీఈ)గా వెంకటేశ్వరరావు శుక్రవారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఆ విభాగంలో పని చేస్తున్న సూర్యప్రకాష్ ఈఈ(ఎంఆర్‌టీ)గా చేరారు. అదేవిధంగా సీఆర్‌డీఏ సర్కిల్ ఈఈ(టెక్నికల్, కన్‌స్ట్రక్షన్)గా జె.హరిబాబు విధుల్లో చేరారు. టౌన్-1 డిప్యూటీ ఈఈగా వై.ఏడుకొండలు బాధ్యతలు చేపట్టారు. డి-1 ఏఈగా అక్కిరెడ్డి, డి-2 ఏఈగా శ్రీనివాసరావు, డి-4 ఏఈగా అంజనీరావు నూతన బాధ్యతలు చేపట్టారు.

కాచిగూడ రైలు రద్దు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఇంజినీరింగ్ పనులు జరుగుతున్నందున కాచిగూడ-నడికుడి-కాచిగూడ మధ్య నడిచే రైలు(07791/07792)ను అక్టోబరు 1 నుంచి 31వ తేదీ వరకు రద్దు చేసినట్లు మండల రైల్వే అధికారి తెలిపారు.

ప్రతి విద్యార్థి బాధ్యతగా ఉండాలి

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి బాధ్యతగా మన ఇంటిని, చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనితాదేవి అన్నారు. టీజేపీఎస్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవా'లో భాగంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ భానుమురళి విద్యార్థులతో శుక్రవారం ప్రతిజ్ఞ చేయించారు.

శివాజీకి మాజీ డీజీపీ పరామర్శ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ, రైతు నాయకుడు డాక్టర్ యలమంచిలి శివాజీని మాజీ డీజీపీ డాక్టర్ మాలకొండయ్య శుక్రవారం పరామర్శించారు. ఇటీవల గొంతు శస్త్ర చికిత్స చేయించుకొని బృందావన్ గార్డెన్స్‌లోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న శివాజీని మాజీ డీజీపీ మాలకొండయ్యతో పాటు తానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ మంతెన నర్సరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

సంకల్ప్-2024 వేడుకలు ప్రారంభం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అభిషేక్, కళాశాల అధ్యాపకులు

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే: గుంటూరు శివారులో కళ్లం హరనాథ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం సంకల్ప్-2024 జాతీయ స్థాయి విద్యార్థుల టెక్నికల్, మేనేజ్‌మెంట్ వేడుకలు ప్రారంభించామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హియరింగ్ వర్చసా సాఫ్ట్‌వేర్ నేషనల్ హెడ్ (హైదరాబాద్) జి.అభిషేక్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి మొదటి ఏడాది నుంచి లక్ష్యాలు సాధించేందుకు, ఉద్యోగ అవకాశాలు పొందడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు 'బి' సర్టిఫికెట్ ప్రదానం



ధ్రువపత్రాలతో ఎన్‌సీసీ విద్యార్థులు, అధ్యాపకులు

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ శిక్షణ, విద్యార్థుల దేశభక్తికి, సామాజిక సేవకు నిదర్శనం అని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్, కె.మద్దినేని పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ బాలుర విభాగ సర్టిఫికెట్-బి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించిన 16 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంచుకోండి

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: కళాశాల దశలో విద్యార్థులు సహ పాఠ్యేతర అంశాల్లోనూ చొరవ చేసి పాల్గొంటే.. నాయకత్వ లక్షణాలు వృద్ధి చెందుతాయని కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకుడు ప్రత్యూష సుబ్బారావు అన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం- కెరీర్ మార్గదర్శకాలు'.. అనే అంశంపై అవగాహన సదస్సు ప్రిన్సిపల్ జ్యోత్స్నకుమారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. నాయకత్వ లక్షణాల గురించి అవగాహన కల్పించారు. జిల్లా స్టెప్ విభాగం మేనేజర్ బి.రాధిక, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

'హత్యలు, అరాచకాలే.. మానవత్వమా?'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'జగన్ మతం మానవత్వం అయితే ముఖ్యమంత్రి పదవి వెలగబెట్టిన అయిదేళ్లలో ఎన్నో హత్యలు, మరెన్నో అరాచకాలు జరిగాయి. ఇదేనా జగన్ మానవత్వం'.. అని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ ప్రశ్నించారు. బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'హిందూ ధార్మిక విధానాలపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు. చంద్రబాబు దేవుళ్ల విషయంలో రాజకీయాలు చేయట్లేదు. తితిదే డిక్లరేషన్‌పై సంతకాలు చేయకుండా కుట్ర రాజకీయం చేస్తుంది జగన్. తిరుమల పర్యటనలో వైకాపా శ్రేణులు అరాచకాలు సృష్టిస్తాయని పోలీసులు సెక్షన్ 30 నోటీసులు ఇస్తే.. దాన్ని కూడా స్వార్థ రాజకీయాలకు వాడుకోవడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనం. తాను 11 సార్లు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటే ఏనాడూ డిక్లరేషన్‌పై సంతకం అడగలేదని అధికారులపై జగన్ నెపం వేశారు. అందుకే మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారు. తిరుమల పర్యటన రద్దు చేసుకోవడం సనాతన హిందూ ధార్మిక భక్తుల విజయం. భవిష్యత్తులో జగన్ ఎప్పుడు తిరుమల వెళ్లినా డిక్లరేషన్‌పై సంతకం చేస్తానని ముందుగా ప్రకటిస్తేనే అక్కడ అడుగు పెట్టనిస్తాం. లేదంటే అడ్డుకుంటాం'..అని హెచ్చరించారు. సమావేశంలో సనాతన ధర్మపరిరక్షణ ఐకాస నాయకులు జంధ్యాల రామలింగేశ్వరశాస్త్రి, వావిలాల కుమార్, గోపీచంద్, పార్వతి, కృష్ణచైతన్య, ప్రసాద్, నాగేశ్వరరావు, ఫణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ప్రచారం

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతపై ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నృత్యం, సంగీతం, పాటల ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సమావేశంలో డీఆర్ఎం రామకృష్ణ, ఏడీఆర్ఎం సైమన్, సీపీఎం మనోహరరెడ్డి, సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో జ్యోతిబసు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. పంచాయతీరాజ్ చట్టం, ఆర్‌జీఎస్ఏ యాప్ 2024-25పై ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు, డీఎల్‌పీవోలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రారంభమైంది. సీఈవో జ్యోతిబసు తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా పలు కార్యక్రమాలు విధిగా అమలు చేయాలని, స్థానిక సంస్థల ప్రతినిధులతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. శిక్షణ పర్యవేక్షకులుగా హాజరైన ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కె.నాగేశ్వరరావు, డీఆర్‌పీలు, అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు తూర్పు

తెదేపా హయాంలోనే బీసీలకు పెద్దపీట

పట్నంబజారు, న్యూస్‌టుడే: బీసీల అభ్యున్నతికి తెదేపా పెద్ద పీట వేస్తుందని ఏపీ నాయీబ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.రాజారావు అన్నారు. పాతగుంటూరులోని నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం జరిగిన ఏపీ నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీబ్రాహ్మణుల ఉన్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రానున్న రోజుల్లో గుంటూరు పార్లమెంటు అధికార ప్రతినిధి కందుకూరి వెంకటేశ్వరరావుకు నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కె.రోజ్‌కుమార్, టి.శ్రీనివాస్, వెంకటకృష్ణ జి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

ఎన్‌టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో రూ.ల్లో) టమాట 44, వంగ 24, బెండ 19, మిర్చి 18, కాకర 24, క్యారెట్ 42, క్యాలీఫ్లవర్ 34, క్యాబేజీ 24, బీర 24, దొండ 34, బంగాళదుంప 38, ఉల్లిపాయలు 45, గోరు చిక్కుళ్లు 37, దోస 26, పొట్ల 29, మునగ 8, చిక్కుళ్లు 36, చామదుంప 38, మునగ 6, గోంగూర 8, తోటకూర 10, కొత్తిమీర 30, బీట్‌రూట్ 32, కీర 34, క్యాప్సికం 64, అల్లం 95, బీన్స్ 55, సొర 10, అరటి 7. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

స్పందనకు వందనం

★ గుంటూరువారితోట గౌరీశంకర్ థియేటర్ రోడ్డులో కల్వర్టు వద్ద పూడికలతో మురుగు రహదారి పైకి వస్తుందని స్థానికులు మేమున్నాం.. మీకుతోడుగా తెలియజేయడంతో శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లగా కాల్వర్టు కింద సిల్ట్‌ను శుక్రవారం తొలగించారు.

★ పాతగుంటూరు పోలీస్ స్టేషన్ వెనుక కాల్వల్లో చిన్నపాటి వర్షం పడినా మురుగు రోడ్డుపైకి చేరి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సమస్యను ఎస్ఎస్ దృష్టికి తీసుకెళ్లగా కాల్వల్లో సిల్ట్‌ను తొలగించి మురుగు పారుదల సాగేలా చర్యలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ(గుంటూరు)

అక్రమాలకు అడ్డాగా.. మెప్మా..!

నిలిచిన కార్యకలాపాలు
మహిళా సంఘాలకు శిక్షణ కరవు

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కార్యకలాపాలు గత వైకాపా ప్రభుత్వం హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఆ విభాగం పర్యవేక్షణకు సమర్థులైన అధికారులను ఇవ్వకపోవడంతోపాటు మహిళా, స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం అంతంతమాత్రంగా ఉండడంతో స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయాయి. ఇదే అదనుగా మెప్మా సిబ్బంది సీఎంఎంలు, సీవోలు కొందరు బ్యాంకర్లతో కుమ్మక్కై బోగస్ గ్రూపులను సృష్టించి రూ.కోట్లలో రుణాలు పొంది అక్రమాలకు పాల్పడగా పలువురిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. తిరిగి చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తుండడంతో విచారించగా బోగస్ గ్రూపుల అక్రమాలు బయటపడుతున్నాయి.


లక్ష్మీపురంలోని పట్టణ జీవనోపాధుల కేంద్రం

ప్రోత్సాహం లభించక..

స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించక పోవడంతో కొత్త గ్రూపుల నిర్మాణం కూడా పూర్తిగా తగ్గిపోయింది. బ్యాంకు లింకేజీ రుణాలు పొందిన గ్రూపులను యూనిట్లు పెట్టించేందుకు ప్రోత్సహించాల్సి ఉండగా అలాంటివి జరిగిన పరిస్థితులు లేవు. యూనిట్లు స్థాపించి ఉత్పత్తులు చేసినా వాటిని విక్రయించుకునేందుకు మెప్మా బజార్లు ఏర్పాటు చేయలేదు. ఆన్‌లైన్‌లో మార్కెటింగ్‌కు అవకాశం కల్పిస్తామని చెప్పి ఆ దిశగాను ప్రయత్నాలు చేయలేదు. పట్టణ జీవనోపాధుల కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ అమలు చేయలేదు.

నగరంలో మహిళా సంఘాలు	11,600
యూనిట్లు స్థాపించిన వారు	3,200
సీఎంఎంలు	05
సీవోలు	25
ఆర్పీలు	370

అక్రమాలకు కేరాఫ్‌గా..

కొందరు సీవోలు నాడు పనిచేసిన పీవో వెంకటనారాయణ అండదండలతో బోగస్ సహాయక సంఘాలను సృష్టించి పలు బ్యాంకుల నుంచి రూ.కోట్లలో రుణాలు పొందారు. ఆటోనగర్ యూనియన్, లాంచెస్టర్ రోడ్డు చైతన్య గోదావరి గ్రామీణ, నల్లపాడు ఐవోబీ తదితర బ్యాంకుల నుంచి బోగస్ గ్రూపులతో రుణాలు స్వాహా చేశారు. ఐపీడీ కాలనీలో జరిగిన బోగస్ గ్రూపుల దందా గురించి నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కూడా పీవోకు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమాలకు సంబంధమున్న పలువురు సీవోలు, ఆర్‌పీలపై చర్యలు తీసుకోగా సదరు సీవోలు వేరే మున్సిపాలిటీల్లో తిరిగి పోస్టులు సాధించుకున్నారు. ఇటీవల తొలగించిన ఆర్‌పీలను కూడా తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. మెప్మాలో గడచిన ఐదేళ్లుగా జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంది. స్వయం సహాయక సంఘాలను గాడిన పెట్టేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని మహిళలు కోరుకుంటున్నారు.

తిరిగి ప్రారంభిస్తేనే పునరుజ్జీవం

జీఎంసీలో ఉపాసెల్‌లో పీవోతోపాటు ఇతర సిబ్బంది నియామకం చేపట్టి మెప్మా కార్యకలాపాలు తిరిగి ప్రారంభిస్తేనే పునరుజ్జీవం సాధ్యమవుతుంది. ఇప్పటికే యూనిట్లు స్థాపించి వివిధ రకాల ఉత్పత్తులు చేస్తున్న వారిని ప్రోత్సహించేందుకు మెప్మాబజార్లను నియోజకవర్గానికి కనీసం రెండైనా ఏర్పాటు చేయాల్సి ఉంది. పట్టణ జీవనోపాధుల కేంద్రాలు తూర్పులో పాతగుంటూరు నందివెలుగురోడ్డు, శారదాకాలనీ, పశ్చిమంలోని లక్ష్మీపురం మదర్‌థెరిసా కూడలి, నల్లచెరువులో ఉన్న కార్యాలయాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మహిళా సంఘాల్లోని వారికి స్వయం ఉపాధి శిక్షణలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పీవీజీ రాజు శత జయంతి సభకు ముఖ్యమంత్రికి ఆహ్వానం


పీవీవీ రాజు జీవితచరిత్ర పుస్తకాన్ని సీఎం చంద్రబాబు అందజేస్తున్న లక్ష్మణరెడ్డి

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: దాతృత్వానికి ప్రతీకగా నిలిచిన పీవీజీ రాజు శత జయంతి సభకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని సీఎం చంద్రబాబునాయుడును ఆహ్వానించినట్లు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. శుక్రవారం సీఎంను రాష్ట్ర సచివాలయంలో కలిసినట్లు పేర్కొన్నారు. అక్టోబరు చివరి వారంలో గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జనచైతన్యవేదిక, ఠాగూర్‌మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పీవీజీ రాజు శతజయంతి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు విశిష్ట అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు.

జాతీయ ఉత్తమ పురస్కారం



ఏపీటీ ఐకాన్ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న ప్రొ.రామారావు

తుళ్లూరు, న్యూస్‌టుడే: లాం చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.నాదెండ్ల రామారావుకు జాతీయ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు లభించింది. ఒడిశాలోని భువనేశ్వర్ ఉత్కల్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో శాస్త్రవేత్త డా.పులోక్ ముఖర్జీ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. దీంతో పాటు ఏపీటీఐ ప్రశంసాపత్రంతో పాటు పది వేల నగదు బహుమతి అందజేశారు. ఆ నగదును తిరిగి ఏపీటీఐకు ఇచ్చారు. భారత దేశం నుంచి తీసుకున్న 300 అప్లికేషన్స్‌లో రామారావుకు అవార్డు దక్కటం గమనార్హం. మూడు దశాబ్దాలకు పైగా ఆయన ఉపాధ్యాయ వృత్తిలో తనదైన ముద్ర వేసుకున్నారని, పురస్కారం దక్కడం సంతోషకరమని చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి ఆంజనేయులు, కార్యదర్శి సుజిత్ కుమార్ అభినందనలు తెలిపారు.

మైనర్లు వాహనాలు నడపకూడదు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, సీఐ సింగయ్య, ఎస్సైలు

గుంటూరు నేరవార్తలు, పట్నంబజారు, న్యూస్‌టుడే: మైనర్లు ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు నడపకూడదని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ అన్నారు. డీఎస్పీ తన కార్యాలయంలో శుక్రవారం గుంటూరు తూర్పు, పశ్చిమ పరిధిలోని పలు విద్యాసంస్థలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపకూడదన్నారు. విద్యార్థులతో ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సీఐలు సింగయ్య, అశోక్‌కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన విద్యుత్తు ఇంజినీర్లు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: గుంటూరు సర్కిల్ కార్యాలయంలో కార్యనిర్వాహక ఇంజినీరు(డీపీఈ)గా వెంకటేశ్వరరావు శుక్రవారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఆ విభాగంలో పని చేస్తున్న సూర్యప్రకాష్ ఈఈ(ఎంఆర్‌టీ)గా చేరారు. అదేవిధంగా సీఆర్‌డీఏ సర్కిల్ ఈఈ(టెక్నికల్, కన్‌స్ట్రక్షన్)గా జె.హరిబాబు విధుల్లో చేరారు. టౌన్-1 డిప్యూటీ ఈఈగా వై.ఏడుకొండలు బాధ్యతలు చేపట్టారు. డి-1 ఏఈగా అక్కిరెడ్డి, డి-2 ఏఈగా శ్రీనివాసరావు, డి-4 ఏఈగా అంజనీరావు నూతన బాధ్యతలు చేపట్టారు.

గుర్రం జాషువా పురస్కారాలు అందజేత


గుమ్మా సాంబశివరావు, గంటేడ గౌరునాయుడుకు పురస్కారం అందిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, లక్ష్మణరావు, బాలసుబ్రహ్మణ్యం, పాశం రామారావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గుర్రం జాషువా జయంతి వేడుకలు శుక్రవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అతిథులు అందరూ గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం, జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు తదితరుల చేతుల మీదుగా సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు, అభ్యుదయ కవి గంటేడ గౌరునాయుడులకు గుర్రం జాషువా పురస్కారాలను అందించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జాషువా సాహిత్య కాలంనాటి సామాజిక అంతరాలు నేటికీ కొనసాగుతున్న నేపథ్యంలో జాషువా సాహిత్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన అవసరం ఉన్నదన్నారు. జాషువా విజ్ఞానకేంద్రం కార్యదర్శి కాళిదాసు, సాహితీవేత్తలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు

పట్నంబజారు, న్యూస్‌టుడే: అక్టోబరు 17న పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 15న రాత్రి 9.45 గంటలకు బస్టాండు నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరి 16న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడి నుంచి బయలుదేరి అక్టోబరు 17న అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. దర్శన అనంతరం 17న తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. ఒక టికెట్ ధర రూ.2,420గా నిర్ణయించామన్నారు. ప్రయాణికులు టికెట్లను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 73828 89830 నెంబరును సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఉచిత రేబిస్ టీకా నేడు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 28న ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులకు శనివారం ఉచితంగా రేబిస్ టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశువైద్యశాల ఉపసంచాలకులు వైద్యురాలు ఎం.రత్నజ్యోతి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం నుంచి కొత్తపేటలోని పశువైద్యశాలలో టీకా వేయనున్నట్లు తెలిపారు.

ప్రమాదం అంచున ప్రయాణం



హిందూ కాలేజీ వెనుక రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎత్తు రోడ్డు సెంటర్ నుంచి హిందూ కాలేజీ వెనుక రోడ్డుకు వచ్చేందుకు రాజీవ్‌గాంధీ భవన్ సెంటర్ వరకు వెళ్లాల్సి ఉంది. వాహనదారులు అక్కడి వరకు ప్రయాణించకుండా పోలీసులు ఏర్పాటు చేసిన డివైడర్ మధ్యలో నుంచి రాకపోకలు చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు తక్షణం స్పందించి ఈ ప్రాంతంలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

తొలగించారు.. వదిలేశారు



పట్నంబజారు పరిసర ప్రాంతాల్లో కొద్దిరోజుల కిందట అధికారులు కాలువల పైకప్పును తొలగించారు. వాటితో పాటు మెట్లను కూడా తొలగించడంతో నిత్యం షాపులకు వచ్చే వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైన స్పందించి కాలువలపై నిర్మాణ పనులు చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పట్నంబజారు

ప్రజా భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. పంచాయతీరాజ్ చట్టం, ఆర్‌జీఎస్‌ఏ యాప్ 2024-25పై ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు, డీఎల్‌పీవోలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రారంభమైంది. సీఈవో జ్యోతిబసు తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. శిక్షణ పర్యవేక్షకులుగా హాజరైన ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కె.నాగేశ్వరరావు, డీఆర్‌పీలు, అధికారులు పాల్గొన్నారు.

డీఈగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ డిప్యూటీ ఇంజనీర్ (డీఈ)గా సీహెచ్ శ్రీనివాసులు శుక్రవారం నాజ్‌కూడలిలోని ఆశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కర్నూరు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో విధులు నిర్వహించారు. తిరుపతిలో డీఈగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీలో గుంటూరు జోన్ డీఈగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాసులుకు ఆశాఖ సహాయక ఇంజినీర్లు, స్థపతి, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంజుమన్ ఇస్లామియా హైస్కూల్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

పట్నంబజారు, న్యూస్‌టుడే: అంజుమన్ ఇస్లామియా హైస్కూల్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. అంజుమన్ ఇస్లామియా హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థుల నైతిక విలువలు, అరబ్బీ ఉర్దూ భాషాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ.. విద్యార్థులతోపాటు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నైతిక విలువకు కట్టుబడి పని చేయాలన్నారు. ఉర్దూ, అరబ్బీ భాషలను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులు ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. అంజుమన్ ఇస్లామియా కమిటీ ట్రెజరర్ మహమ్మద్ జాహిద్, మౌలానా సయ్యద్ అబ్దుల్ రెహమాన్ ఖాస్మీ, సైదా, షౌకత్ పాల్గొన్నారు.

పట్నంబజారు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల పాలనలో నగరంలో సుమారు రూ.5కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే నసీర్ అన్నారు. 12వ డివిజన్‌లో శుక్రవారం రూ.49లక్షల వ్యయంతో పైపు లైన్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతంలో ఇంతవరకు పైపు లైన్లు ఏర్పాటు చేయలేదన్నారు. కార్పొరేటర్ చిష్తి, హఫీజ్, అబ్దుల్ సలీం, మల్లి, రాయపాటి అమృతరావు తదితరులు పాల్గొన్నారు.


ఏబీ బర్దన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, తదితరులు

ఏబీ బర్ధన్‌కు నివాళి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సీపీఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ శత జయంతి సభ శుక్రవారం కొత్తపేటలోని కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు

డీసీ కార్యాలయ పర్యవేక్షకులుగా సుధాకర్



నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ గుంటూరు జోన్ ఉపకమిషనర్ కార్యాలయ పర్యవేక్షకులుగా ఎస్వీ సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఒంగోలు, నెల్లూరు ఏసీ కార్యాలయాల్లో విధులు నిర్వహించారు. ఇటీవల బదిలీలలో గుంటూరు డీసీ కార్యాలయంకు నియమితులయ్యారు

సహాయ కమిషనర్‌గా సుభద్ర..



నెహ్రూనగర్, న్యూస్‌టుడే : దేవాదాయశాఖకు చెందిన కొత్తపేట జగన్నాథ స్వామి గ్రూప్ ఆలయాల ఈవోగా సహాయ కమిషనర్ (ఏసీ) పి.సుభద్ర శుక్రవారం లాలాపేటలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సింగరకొండ ఆంజనేయస్వామి ఆలయ ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఇటీవల బదిలీలలో భాగంగా జగన్నాథ స్వామి గ్రూప్ ఆలయాల ఈవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆమెను గత ఈవో, సహాయ కమిషనర్ శ్రీనివాసరావు, ఏసీ చంద్రమౌళి, ఆలయ అర్చకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణమూర్తి తదితరులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సివిల్ సప్లయీస్ ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేపట్టేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. గుంటూరులోని సివిల్ సప్లయీస్ గోదాముల వద్ద కార్మికులు రెండు గంటలపాటు పని నిలుపుదలచేసి బంద్ చేశారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, జిల్లా అధ్యక్షుడు మరియదాసు నాయకులు కాంతారావు, డేవిడ్, జాన్‌బాబు, బుజ్జి, కిరణ్ పాల్గొన్నారు.

సంకల్ప్-2024 వేడుకలు ప్రారంభం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అభిషేక్, కళాశాల అధ్యాపకులు

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే: గుంటూరు శివారులో కళ్లం హరనాథరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం సంకల్ప్-2024 జాతీయ స్థాయి విద్యార్థుల టెక్నికల్, మేనేజ్‌మెంట్ వేడుకలు ప్రారంభించామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హియరింగ్ వర్చసా సాఫ్ట్‌వేర్ నేషనల్ హెడ్ (హైదరాబాద్) జి.అభిషేక్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి మొదటి ఏడాది నుంచి లక్ష్యాలు సాధించేందుకు, ఉద్యోగ అవకాశాలు పొందడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

అదనపు కమిషనర్‌గా ఓబులేసు..



నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా చల్లా ఓబులేసు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల వరకు ఏసీగా చేసిన రాజ్యలక్ష్మి మాతృశాఖ రెవెన్యూశాఖకు బదిలీపై వెళ్లారు. దీంతో డిప్యూటీ కమిషనర్‌గా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ఈఎస్‌గా శ్రీలత..



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్‌గా (డీఎం)గా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) శ్రీలత శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం ఈఎస్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఇటీవల బదిలీలలో గుంటూరు డిపో మేనేజర్‌గా నియమించారు.

ఎమ్మెల్యే మాధవిని కలిసిన ఏసీ

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ గుంటూరు జిల్లా సహాయ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గ్రంధి మాధవి శుక్రవారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించండి



ప్రదర్శనలో లక్ష్మీనారాయణ, భవన నిర్మాణ కార్మికులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం నెహ్రూనగర్, కంకరగుంట వద్ద నిరసన తెలిపారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. భవన నిర్మాణ సామగ్రి ధరలు అందుబాటులోకి తీసుకురావాలని, ఇసుకను సమగ్రంగా అందించాలని, సంక్షేమ బోర్డు పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు దీవెనరావు, ఖాసింవలి, సత్యనారాయణ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతిపై కేసు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ వృద్ధురాలు మృతిపై శుక్రవారం కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. రైలుపేటలో ఒంటరిగా నివసిస్తున్న రేవతి (52) శుక్రవారం ఇంటి ముందు మృతిచెంది పడి ఉంది. అనారోగ్యంతో మృతి చెంది ఉంటుందని స్థానికులు తెలిపారు. కొత్తపేట సీఐ వీరయ్య, ఎస్సై రమేష్ వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి ప్రాథమిక దర్యాప్తు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించామని, ఆమె గురించిన తెలిసినవాళ్లు, బంధువులు ఉంటే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై రమేష్ తెలిపారు.

పెట్రో కెమికల్స్ పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- ఐదేళ్లలో గుజరాత్, ఆంధ్ర, ఒడిశాల్లో ఈ రంగంలో 3.7 లక్షల మందికి ఉపాధి
- కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా



పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న నివేదితా శుక్లా

ఈనాడు, విశాఖపట్నం: గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల్లో మూడు పెట్రోకెమికల్, పెట్రో ఇండస్ట్రియల్ రీజియన్ (పీసీపీఐఆర్)ల ద్వారా రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 3.7 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా వెల్లడించారు. వికసిత్ భారత్‌లో భాగంగా వచ్చే ఐదేళ్లలో ఆ లక్ష్యాలను చేరుకుంటామని ప్రకటించారు. పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్‌లో అనుకూల వాతావరణం కనిపిస్తోందన్నారు. అక్టోబర్ 17 నుంచి 19 వరకు ముంబయిలో కేంద్ర ప్రభుత్వం, ఫిక్కీ ఆధ్వర్యంలో 13వ ఇండియా కెమ్-2024 ప్రదర్శన జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖలో శుక్రవారం నిర్వహించిన పారిశ్రామికవేత్తల సమావేశంలో నివేదితా శుక్లా మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పెట్టుబడిదారుల స్నేహపూర్వక వాతావరణం కనిపిస్తోంది. ఇక్కడ సువిశాల తీరప్రాంతం ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో ఉంది. కొత్త ప్రభుత్వం ఈ ఏడాది రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చి, 1.3 లక్షల మందికి ఉపాధి చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఎక్కువ పెట్టుబడులు ఏపీకి తీసుకువచ్చేలా ఇండియా కెమ్ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థలో రసాయన, పెట్రో కెమికల్స్ రంగం చాలా కీలకమైంది. ప్రపంచ మార్కెట్‌లో మనం ఆరో స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం రసాయన మార్కెట్ విలువ సుమారు 220 బిలియన్ డాలర్లుగా ఉంది. 2040 నాటికి రూ.లక్ష కోట్ల రూపాయలకు పెరుగుతుంది' అని చెప్పారు.

యువతకు శిక్షణ ఇవ్వాలి

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఉపాధి అవకాశాల కోసం యువతకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారి కోసం నిబంధనలు సరళతరం చేయాలని సూచించారు. రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానంతో ఈ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి వీలవుతుందన్నారు. ఈ ఏడాది కేంద్రం బడ్జెట్‌లో కేటాయించిన వంద పార్కుల్లో మూడు మన రాష్ట్రానికి కేటాయించాలని, వాటిలో ఒకటి ప్రత్యేకంగా కెమికల్ పార్క్ ఉండేలా చూడాలని కోరారు. ఏపీలో పీసీపీఐఆర్ ఉన్నప్పటికీ భారీ పరిశ్రమలేవీ రాలేదని.. దీని గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో ఇటీవలే మాట్లాడారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 30 పారిశ్రామికవాడల ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించామన్నారు. కార్యక్రమంలో కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి దీపాంకర్ అరోన్, గంగవరం పోర్టు సీఈఓ అమిత్ మాలిక్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సుదర్శన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



జగన్‌తో సమావేశమైన జిల్లా నేతలతోపాటు ఉన్న అనంతబాబు (వృత్తంలో)

కలిసికట్టుగా పని చేయండి

వైకాపా నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్

ఈనాడు, అమరావతి: 'ప్రజాసమస్యల పరిష్కారం కోసం గట్టిగా నిలబడండి.. ఇందుకోసం ఎక్కువ సమయాన్ని కేటాయించండి.. జిల్లాలోని పార్టీ నేతలంతా ఒక కుటుంబంలా, కలిసికట్టుగా పనిచేయాలి' అని వైకాపా అధ్యక్షుడు జగన్ ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 'ప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలు, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజల్లోకి వెళ్లేందుకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల అధ్యక్షుల ఎంపికపై చర్చించారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి కురసాల కన్నబాబునే కొనసాగించాలని నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా బీసీ సామాజికవర్గానికి చెందిన మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను ఇప్పటికే నియమించినందున.. కోనసీమ జిల్లాకు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని నియమించాలని నేతలు సూచించినట్లు తెలిసింది. దీంతో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్‌ను కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఖరారుచేసినట్లు సమాచారం. ఈ సమావేశానికి ఇటీవల ఎన్నికల్లో అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీచేసి ఓడిన రాపాక వరప్రసాదరావు గైర్హాజరయ్యారు.

ఎమ్మెల్సీ అనంతబాబు ప్రత్యక్షం: కాకినాడ, కోనసీమ జిల్లాల వైకాపా నేతలతో జగన్ నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ అనంతబాబు హాజరవ్వటం చర్చనీయాంశంగా మారింది. దళిత యువకుడి హత్య కేసులో నిందితుడిగా జైలుకు వెళ్లిన ఆయన ఇప్పుడు బెయిల్‌పై బయట ఉన్నారు. హత్య జరిగినప్పుడు ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇప్పటికీ ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయలేదు. కానీ అనంతబాబు మాత్రం గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్వహించిన చాలా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇప్పుడు కూడా క్యాంపుకార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రత్యక్షమవడం గమనార్హం.

రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాల స్వాధీనం

చెన్నై నౌకాశ్రయంలో పట్టివేత

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: చెన్నై నౌకాశ్రయంలో రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి వారు తెలిపిన వివరాల మేరకు... చెన్నై నౌకాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు ఓడలో వెళ్లనున్న కంటెయినర్‌లో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అందులో 112 కిలోల సూడోఎఫెడ్రిన్ అనే మత్తు పదార్థం ఉన్నట్లు గుర్తించారు. దీని రవాణాకు ఉపయోగించిన 2 లగ్జరీ కార్లతో పాటు రూ.3.9 లక్షలు స్వాధీనం చేసుకుని అబుతాహిర్, అహ్మద్ బాషా అనే ఇద్దరు ఏజెంట్లను అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా.. ఇదే విధంగా నాలుగుసార్లు ఆస్ట్రేలియాకు మత్తు పదార్థాలు తరలించారని, అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు ఇందులో ప్రమేయం ఉందని తేలింది. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన విరమణ

- మంత్రి హామీలకు సానుకూలంగా నిర్ణయం



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు లేఖ అందిస్తున్న వైద్య సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్ తదితరులు

ఈనాడు, అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆందోళన కార్యక్రమాలను విరమించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నుంచి లభించిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు లేఖను వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు సచివాలయంలో శుక్రవారం అందజేశారు. ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ వైద్యవిద్యకు కేటాయించిన సీట్లను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85ను నిరసిస్తూ ఈ నెల 17 నుంచి పీహెచ్‌సీ వైద్యులు ఆందోళనలు చేస్తున్నారు. సంఘం ప్రతినిధులతో చేపట్టిన చర్చల్లో మంత్రి సత్యకుమార్ 85 జీఓను సవరిస్తామని, క్లినికల్ విభాగంలో 15% బదులు 20% సీట్లను అన్ని స్పెషాలిటీల్లో కేటాయిస్తామని తెలిపారు. సంఘంతో చర్చించిన తర్వాతే ఇన్‌సర్వీస్ కోటాలో సీట్ల కేటాయింపుపై నిర్ణయాలు తీసుకుంటామని, ఇతర డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. వీటిని స్వాగతిస్తూ.. సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్, ఇతర వైద్యులు కృష్ణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 17 నుంచి తాము విధుల్లో ఉన్నట్లు పరిగణించి వేతనాలు చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, ట్రైబల్ ఎలవెన్సులు చెల్లించాలని అందులో కోరారు.

నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదుకు ఆదేశం



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని బెంగళూరు తిలక్‌నగర ఠాణా పోలీసులను చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను నిర్మలా సీతారామన్ బెదిరించి భాజపాకు నిధులు వచ్చేలా చేశారని జనాధికార సంఘర్ష పరిషత్తుకు చెందిన ఆదర్శ్ అయ్యర్ గతంలో తిలక్‌నగర ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించి, తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేశారు.

అక్కడికి నేనొచ్చినట్లు ఎవరూ చెప్పలేదు

'ఈనాడు' కథనానికి సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ వివరణ

ఈనాడు, అమరావతి: మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అరెస్టయిన రోజున తాను సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయానికి వచ్చినట్లు ఎవరూ వాంగ్మూలం ఇవ్వలేదని సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ తెలిపారు. 'కస్టడీలో రఘురామకు చిత్రహింసలు నిజమే' అనే శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఓ ప్రకటనలో ఆయన వివరణ ఇచ్చారు. "ఆరు నెలలకు మించి కాల్ డేటా ఉండదు. అదే విషయం టెలికం సంస్థలూ చెప్పాయి. అలాంటిది నా లొకేషన్ ఎలా వచ్చింది? అది అబద్ధం. రఘురామకృష్ణరాజుకు గాయాల్లేవంటూ ఇచ్చిన సర్టిఫికెట్‌కు గుంటూరు వైద్యులు కట్టుబడి ఉన్నారు. వారు వేరే విధంగా వాంగ్మూలం ఇవ్వలేదు, ఇవ్వరు కూడా. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చామని ఒప్పుకొంటే వారి డాక్టర్ సర్టిఫికెట్ రద్దవుతుంది. రఘురామకు గాయాలు ఉన్నాయని, కొట్టడంవల్లే అవి అయ్యాయని మిలటరీ ఆసుపత్రి వైద్యులు చెప్పలేదు. మిలటరీ డాక్టర్లు సివిల్ కోర్టులకు రారు, సాక్ష్యం చెప్పరు. అది ఆర్మీ యాక్టు వారికి కల్పించిన రక్షణ" అని సునీల్‌కుమార్ వివరించారు.

మార్చిలో ఇంటి నిర్మాణ సాయం పెంపు: మంత్రి కొలుసు

చాట్రాయి, న్యూస్‌టుడే: అందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో త్వరలో స్థలాల కొనుగోలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకోనున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా మర్లపాలెంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. మార్చిలో గృహనిర్మాణ సాయం మొత్తాన్ని పెంచుతామని, ఎంత పెంచాలనేదానిపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సొంత స్థలం ఉన్న పేదలు వెంటనే గృహాలు నిర్మించుకునే అవకాశముందని పేర్కొన్నారు.



విజయం దక్కాలంటే..

విజయం సాధించాలంటే ప్రేరణ అవసరం. కానీ అదొక్కటే సరిపోదు. ప్రారంభించే ధైర్యం ఉండాలి. మొదలుపెట్టిన పనిని నిలకడగా కొనసాగించాలి. విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. అనిశ్చిత పరిస్థితులు, వైఫల్యాలను అధిగమించగల మానసిక బలం కావాలి. వీటన్నింటికీ ఆప్తుల అండదండలూ తోడవ్వాలి.

– హిమాన్షు త్యాగి, ఐఎఫ్ఎస్ అధికారి

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై కేసు

- 'ముడా' అంశంపై లోకాయుక్త చర్యలు

ఈనాడు, బెంగళూరు: మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) స్థలాల పంపిణీ అక్రమాల్లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్రంలో కేసు నమోదైంది. మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఈ కేసు నమోదుచేశారు. ముడా అక్రమాలపై విచారణ చేపట్టిన సంబంధిత కోర్టు.. 3 నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల లోకాయుక్తను ఆదేశించిన క్రమంలో ఈ చర్యలు చేపట్టారు. స.హ. కార్యకర్త స్నేహమయి కృష్ణ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కోర్టు ఈ తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముఖ్యమంత్రి ఏ1, ఆయన సతీమణి పార్వతి ఏ2, బావమరిది మల్లికార్జున స్వామి ఏ3, భూములు విక్రయించిన దేవరాజు ఏ4, ఇతరులను ఏ5 నిందితులుగా పేర్కొన్నారు. సీఎంపై భూ ఆక్రమణల నియంత్రణ, అవినీతి నిరోధక, ఫోర్జరీ, బినామీ ఆస్తుల పరిరక్షణ, అధికార దుర్వినియోగం తదితర అభియోగాల కింద పలు సెక్షన్లు పెట్టారు. ఈ క్రమంలో తన రాజీనామా కోసం విపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'గోద్రా కేసులో ఆనాటి గుజరాత్ సీఎం నరేంద్రమోదీ రాజీనామా చేశారా? అక్రమ గనుల తవ్వకాల కేసులో బెయిల్‌పై ఉన్న కేంద్రమంత్రి కుమారస్వామి నుంచి ప్రధాని రాజీనామా కోరారా?' అంటూ ప్రశ్నించారు. తాను తప్పు చేయలేదని, రాజీనామా చేయనని స్పష్టం చేశారు.

రాజీనామా చేయాల్సిన అవసరం లేదు: ఖర్గే



విలేకర్లతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన అవసరంలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. శుక్రవారం ఆయన బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. కేసు నమోదు చేయగానే సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటే.. గోద్రా కేసులో మోదీ రాజీనామా చేశారా? అమిత్ షా పైనా కేసులున్నాయి కదా? అని గుర్తు చేశారు. సీబీఐకి సాధారణ సమ్మతి ఉపసంహరణ చర్యనూ ఖర్గే సమర్థించారు.

అమ్ముకున్నారు.. సొమ్ము చేసుకున్నారు

ప్రమాదకరంగా తుంగభద్ర కరకట్ట



తాళ్లపాలెం శివారు వద్ద కోతకు గురైన తుంగభద్ర కరకట్ట



తాళ్లపాలెం సమీపంలో ప్రమాదకరంగా కరకట్ట వద్ద విద్యుత్తు స్తంభం

పొన్నూరు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ కాలంలో వైకాపా నేత కరకట్ట మట్టిని కొల్లగొట్టారు. మురుగు కాలువ కరకట్ట మట్టిని అడ్డగోలుగా తవ్వడంతో కట్ట అక్కడక్కడ కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కట్ట మట్టిని తవ్వి అమ్ముకున్నారని అనాటి మురుగు నీటిపారుదల శాఖాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఓ పోలీసు అధికారి వైకాపా నేతతో కుమ్మక్కై ముడుపులు అందుకుని కేసు నమోదు చేయకుండా వదిలేశారు.

✦ పొన్నూరు మండలం తాళ్లపాలెం-ఆరెమండ గ్రామాల మీదుగా తుంగభద్ర మురుగు కాలువ ప్రవహిస్తోంది. కరకట్ట మట్టిపై తాళ్లపాలేనికి చెందిన వైకాపా నేత కన్ను పడింది. మట్టిని తవ్వేందుకు వైకాపాలోని కీలక నేతను సంప్రదించి అనుమతి పొందారు.

అక్రమాలను వెలుగులోకి తెచ్చిన 'ఈనాడు'

మొట్ట మొదటిగా 2022 జనవరి నెలలో తుంగభద్ర కట్ట మట్టి తవ్వకాలను ప్రారంభించారు. జనవరి 29వ తేదీన 'కరకట్ట తవ్వేస్తున్నా.. కళ్లు తెరవరేం' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. పొన్నూరు గ్రామీణ పోలీసులకు అప్పటి మురుగునీటిశాఖ సహాయ ఇంజినీర్ ప్రవీణ్ ఫిర్యాదు చేశారు. అప్పటి గ్రామీణ పోలీసులు కరకట్టను పరిశీలించి వదిలేశారు. వైకాపా నేతల నుంచి ఒత్తిడి రావడంతో కేసు నమోదు చేయలేదు. మట్టి తవ్వకాలను నిలిపి వేశారు. వైకాపా నేత మరలా 2023 జూన్ నెలలో మట్టి తవ్వకాలను ప్రారంభించారు. మట్టి తవ్వకాలపై జూన్ నెల 19వ తేదీన అర్ధరాత్రి అడ్డగోలు దోపిడీ శీర్షికతో కథనం ప్రచురితమైంది.

2 వేల ట్రాక్టర్లు.. రూ.30 లక్షల ఆదాయం

అప్పటి మురుగునీటి శాఖ సహాయ ఇంజినీర్ పాండురంగారావు గ్రామీణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి పోలీసు అధికారి విచారణ చేయకుండా వైకాపా నేతతో మాట్లాడుకుని లక్షల్లో ముడుపులు అందుకుని ఫిర్యాదు పక్కన పడేశారు. రెండు సంవత్సరాల్లో వైకాపా నేత 2,000 ట్రాక్టర్లు మట్టి అమ్ముకున్నట్లు సమాచారం. అందుకు వైకాపా నేతకు రూ.30 లక్షలు వరకు వచ్చినట్లు తెలిసింది. కొంత నగదును వైకాపాలోని కీలక నేతకు అప్పగించినట్లు సమాచారం. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుంగభద్ర మురుగు కాలువలో వరద నిండుగా ప్రవహించింది. కరకట్ట అక్కడక్కడ కోతకు గురైంది. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే పంటలు ముంపు బారిన పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మేల్కొని కరకట్టను బలోపేతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

✦ మురుగునీటిపారుదల శాఖ సహాయ ఇంజినీర్ పాండురంగారావును న్యూస్‌టుడే వివరణ కోరగా తుంగభద్ర కరకట్ట అక్రమంగా తవ్వారని, విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

✦ పొన్నూరు గ్రామీణ ఎస్సై కిరణ్‌బాబును న్యూస్‌టుడే వివరణ కోరగా ఇటీవల బాధ్యతలు తీసుకున్నానని, మట్టి తవ్వకాలు గురించి సమాచారం తెలియదని, విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్-2024



వివరాలు వెల్లడిస్తున్న విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ మూర్తి, పక్కన సుధీర్‌బాబు, యలమందయ్య

కృష్ణలంక, న్యూస్‌టుడే: జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా అక్టోబర్ 13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్- 2024 నిర్వహిస్తున్నట్లు విజయవాడ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి తెలియజేశారు. విజయవాడలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఫిట్ ఇండియా, ఫిట్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ప్రతిఒక్కరిని ఆరోగ్యంపై పునరాలోచింపజేయడమే పోటీల లక్ష్యమని చెప్పారు. 3కే, 5కే, 10కే విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 5కె, 10కె పురుష, మహిళా విభాగాల్లో విజేతలకు రూ.2,40,000 నగదు రివార్డులు అందించనున్నట్లు చెప్పారు. గుంటూరు ఆంధ్రా లూథరన్(బీఈడీ) కళాశాల వద్ద అక్టోబర్ 13వ తేదీ 6 ఉదయం గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. 10కేలో పాల్గొనదలచిన వారు రూ.500, 5కేకు రూ.400, 3కేకు రూ.300 చెల్లించి అక్టోబర్ ఏడో తేదీలోగా https:///indiapostrunap.iq301.com వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు నగదు బహుమతులను అదే రోజు సాయంత్రం ఆంధ్రా లూథరన్ కళాశాల వద్ద అందిస్తామన్నారు. అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్ కందుల సుధీర్‌బాబు, ఎస్పీవోస్ గుంటూరు డివిజన్ యు.యలమందయ్య పాల్గొన్నారు.

శశికృష్ణ మానసిక స్థితి, జైల్లో ప్రవర్తనపై

నివేదిక ఇవ్వండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: గుంటూరులో బీటెక్ విద్యార్థిని రమ్య హత్యకేసులో మరణశిక్ష పడి, ప్రస్తుతం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న దోషి కుంచాల శశికృష్ణ వ్యవహారశైలి, మానసిక స్థితి, అతని కుటుంబనేపథ్యం వివరాలు సమర్పించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. విచారణను అక్టోబరు 22కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరుకు చెందిన శశికృష్ణ.. ప్రేమను తిరస్కరించారన్న కారణంతో రమ్యను 2021 ఆగస్టులో కత్తితో పొడిచి హత్య చేశాడు. విచారణ కోర్టు 2022 ఏప్రిల్ 29న శశికృష్ణకు మరణశిక్ష విధించింది. నిందితుడు దాఖలుచేసిన అప్పీల్‌తో పాటు మరణశిక్షను ఖరారు చేసేందుకు నమోదుచేసిన వ్యాజ్యంపై ఇటీవల హైకోర్టు విచారణ జరిపింది. శశికృష్ణ తరఫు న్యాయవాది చల్లా అజయ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. శిక్ష తీవ్రతను తగ్గించేందుకు వీలున్న అంశాలను విచారణ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. దిగువ కోర్టు విధించిన మరణశిక్షను ఖరారుచేసే విషయంలో హైకోర్టు సైతం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీంతో శశికృష్ణ పూర్వ, ప్రస్తుత స్థితిపై నివేదిక ఇవ్వాలని గుంటూరు జిల్లా కలెక్టర్, డీఎస్పీ, రాజమహేంద్రవరం కారాగార సూపరింటెండెంట్‌ను హైకోర్టు ఆదేశించింది.

క్లోమగ్రంథి క్యాన్సర్‌కు అరుదైన శస్త్రచికిత్స



రోగితో కిరణ్‌కుమార్ పక్కన వెంకటేశ్వరరావు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రాణాపాయస్థితిలో వచ్చిన ఓ రోగికి సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్యులు ప్రాణభిక్ష పెట్టారు. కామెర్లు తగ్గకపోవడం, ఏం తిన్నా వాంతులు, పుల్లటి తేన్పులు వంటి లక్షణాలతో పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. పెద్ద ఆపరేషన్ చేసినా ప్రాణానికి ప్రమాదమని హెచ్చరించడంతో గత నెలలో గుంటూరు సర్వజనాసుపత్రికి వచ్చారు. ఇటీవల సర్జరీ చేయడంతో రోగికి సాంత్వన చేకూరింది. ఆ వివరాలను గుంటూరు సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ వెంకటేశ్వరరావు శుక్రవారం జీజీహెచ్‌లో మీడియాకు వివరాలు తెలిపారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పెద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన లెనిన్‌బాబు రెండేళ్ల నుంచి కామెర్ల సమస్యతో బాధపడుతూ గత ఏడాది జీజీహెచ్‌కు వచ్చారు. గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం వైద్యులు మూడు సార్లు స్టెంట్‌లు వేసినా ఫలితం లేదు. బయాప్సీ నివేదికలోనూ సమస్య తెలియలేదు. దీంతో రోగి పడుతున్న ఇబ్బందులను గమనించి గత నెలలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి పంపారు. ఆ విభాగం వైద్యులు వెంకటేశ్వరరావు అవసరమైన పరీక్షలు చేసిన అనంతరం క్లోమగ్రంథిలో గడ్డ ఉందని తేల్చారు. ఇటీవల సర్జరీ చేసి క్యాన్సర్ కణితి చుట్టుపక్కల భాగాన్నంతా తొలగించామన్నారు. 6 గంటలు పట్టిన ఈ శస్త్రచికిత్సకు మత్తు వైద్యులు సహకరించారన్నారు. సర్జరీ తర్వాత రోగి పూర్తి స్వస్థతతో ఉన్నారని తెలిపారు. క్యాన్సర్ చికిత్సలు జీజీహెచ్‌లోనే అందుబాటులో ఉన్న విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు మీడియాకు వివరించామన్నారు. ఈ చికిత్సలో కోటి వెంకటేశ్వరరావు, సత్యదేవ్, వంశీ, పోలయ్య, శాంసన్‌దేవ్, శ్వేత, దీప్తి శాలిని తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

శ్రీవెంగమాంబ సేవా సమితి ఔదార్యం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం గుంటూరులోని డొంకరోడ్డుకు చెందిన శ్రీవెంగమాంబ సేవా సమితి సభ్యులు రూ.6,10,000 విరాళం అందజేశారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సూచనతో సమితి సభ్యులు మాదాల బాబు, గుర్రం వెంకటేశ్వర్లు, కల్లూరి రమణయ్య, సోమినేని శ్రీనివాసరావు, టీవీ రమణయ్య, రమణ, బత్తిన ప్రసాద్, ధనియాల గాంధీ, దర్శి శ్రీహరి తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విరాళం చెక్కును శుక్రవారం అందజేశారు. విరాళం అందజేసిన సేవా సమితి సభ్యుల్ని సీఎం చంద్రబాబు అభినందించారు.

రైతులకు రుణాలు మంజూరు చేయండి



మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ, పక్కన డీసీవో వీరాచారి, డీసీసీబీ సీఈవో కృష్ణవేణి

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: సొసైటీల ద్వారా రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి, జేసీ ఎ.భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో శుక్రవారం సొసైటీల పర్సన్ ఇన్‌ఛార్జులు, సీఈవోలతో సమావేశమయ్యారు. జేసీ భార్గవ్ తేజ మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తూ రైతులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. మొండి బకాయిల వసూళ్ల వివరాలను సంఘాల వారీగా సమీక్షించారు. ఖరీఫ్ సమయం ముగియనుందని, చాలాచోట్ల నిబంధనల పేరుతో రుణాలు మంజూరు చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆధార్ చిరునామా ఆధారంగా జిల్లా పరిధిలో పొలం ఉంటే ఆ ప్రాంతంలోని సొసైటీ నుంచి ఎన్‌ఓసీ తెప్పించుకుని అర్హులైతే రుణాలివ్వాలన్నారు. సమావేశంలో డీసీవో ఎం.వీరాచారి, డీసీసీబీ సీఈవో టి.కృష్ణవేణి, సొసైటీల పర్సన్ ఇన్‌ఛార్జులు, సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి



వెంకటేశ్వర్లు (పాత చిత్రం)

పొన్నూరు, న్యూస్‌టుడే: ఇంటి ఆవరణలో పాము కాటుకు గురై కౌలు రైతు మృతి చెందిన సంఘటన ఇది. గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పచ్చలతాడిపర్రుకు చెందిన కావటి వెంకటేశ్వర్లు (65) కొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఇంటి ఆవరణలోని మొక్కజొన్న కండెలు తీసుకురావడానికి శుక్రవారం వెళ్లిన సమయంలో పాము కాటు వేసింది. ఆయన గమనించలేదు. కొంత సమయం తరవాత అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ప్రత్యేక వాహనంలో పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.28 లక్షల మోసం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని నందులపేటకు చెందిన ప్రైవేటు ఉపాధ్యాయినికి సామాజిక సైట్ల ద్వారా పరిచయమైన గుర్తు తెలియని వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్ నేర్పుతామని, ఆ విధానం మంచి లాభాలు గడించవచ్చని చెప్పాడు. ఉపాధ్యాయిని ఆమోదం తెలిపిన తరవాత కొద్ది రోజులు ఆ విధానం గురించి తెలియచేసిన అనంతరం పెట్టుబడులు పెట్టండి, తాను మధ్యలో ఉండి పర్యవేక్షిస్తానన్నాడు. ఆ మాటలు నమ్మిన ఆమె అతను చెప్పిన పలు బ్యాంకు ఖాతాలకు దశల వారీగా రూ.45.50 లక్షలు పంపారు. వాటికి లాభాలు జత చేస్తూ మొత్తం మీద మీ వద్ద 1.52 కోట్లు చేరాయని నకిలీ సైట్ ద్వారా తెలియజేశాడు. ఈ క్రమంలో ఆ మహిళ రెండు నెలల కిందట తాను తన ఖాతా నుంచి రూ.50 లక్షలు విత్‌డ్రా చేసుకుంటానని చెప్పగా.. తనకు 10 శాతం కమీషన్ ఇస్తేనే విత్‌డ్రా చేసుకోవచ్చునని చెప్పాడు. నా నగదు విత్‌డ్రా చేసుకోవటానికి నీకు కమిషన్ ఇవ్వటం ఏమిటి? అంటూ ప్రశ్నించిన తర్వాత ఆ ఫోన్ నంబరు ఆగిపోయింది. తర్వాతా పని చేయలేదు. వివిధ మార్గాల ద్వారా ఖాతాలు పరిశీలించుకున్న ఉపాధ్యాయిని తాను మోసపోయానని గుర్తించి గుంటూరు సైబర్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఆయా ఖాతాలను పరిశీలిస్తే అవన్నీ రాజస్థాన్, నోయిడా, ఉత్తర ప్రదేశ్ తదితర ఉత్తరాది ప్రాంతాలకు చెందినవిగా తేలింది. పోలీసులు సత్వరం స్పందించి ఆ సమయానికి ఆమె పంపిన ఖాతాల్లో ఉన్న రూ.17.40 లక్షలు హోల్డ్‌లో పెట్టించారు. అంటే ఆ మొత్తం ఆమెకు చేరతాయి. రూ.28 లక్షలకు మోసం జరిగిందని శుక్రవారం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.